
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
మంగళవారం 8 జూలై 2025



పార్కులు అన్యాక్రాంతం!

రికార్డుల్లో దశాబ్దాలుగా జీవీఎంసీ పార్కులుగా మార్కింగ్

వాటిని కొట్టేయాలని కొందరి యత్నం

- వెనకుండి తతంగం నడిపిస్తున్న నేతలు
- ఈస్ట్‌పాయింట్ కాలనీలోని రెండు పార్కులపై కూటమి నేత కన్ను
- మహిళతో అగ్రిమెంట్
- ప్రైవేటు స్థలంగా నిర్ధారిస్తూ నివేదిక ఇచ్చేందుకు సిద్ధపడిన టౌన్‌ప్లానింగ్
- రాజేంద్రనగర్ పార్కు ప్రైవేటు స్థలంగా నివేదిక ఇచ్చిన జీవీఎంసీ సర్వేయర్
- వెనుక మాజీ ఎమ్మెల్యే, ఇద్దరు వైసీపీ కార్పొరేటర్లు
- వీఎల్‌టీ విధించాలని రెవెన్యూ విభాగం అధికారులపై ఒత్తిడి
- డీసీఆర్ తిరస్కరించడంతో నిలిచిన ప్రక్రియ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ ఆస్తులుగా రికార్డుల్లో కొనసాగుతున్న పార్కులపై కూటమిలోని కొందరు నేతల కన్నుపడింది. ప్రైవేటు వ్యక్తులను ముందుంచి పార్కు స్థలాలను కొట్టేయాలని చూస్తున్నారు. ఇప్పటికే మధురవాడలోని బటర్‌ఫ్లై పార్కులో 400 గజాల స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు అనుకూలంగా ఉత్తర్వులు తీసుకువచ్చారు. తాజాగా నగర నడిబొడ్డున ఉన్న రాజేంద్రనగర్ పార్కు, ఈస్ట్‌పాయింట్ కాలనీలోని రెండు పార్కులను కూడా చేజిక్కించుకునేందుకు అంతా సిద్ధం చేసుకున్నారు.



జీవీఎంసీ 20వ వార్డు పరిధి ఈస్ట్‌పాయింట్ కాలనీలోని పార్కు

జీవీఎంసీ 20వ వార్డు పరిధి ఈస్ట్‌పాయింట్ కాలనీలోని షిర్డీ సాయిబాబా ఆలయ సమీపాన బాబా చావడి, లెండీవనం అని రెండు పార్కులు ఉన్నాయి. వాల్తేరు వార్డు టౌన్ సర్వే నంబర్ 124లో ఉన్న బాబాచావడి పార్కు 1,397 చదరపు గజాలు, లెండీవనం పార్కు 2,263 గజాల్లో విస్తరించి ఉంది. రెండు పార్కులు సుమారు 30 ఏళ్లుగా టౌన్ సర్వే రికార్డుల్లో జీవీఎంసీ ఆస్తులుగానే ఉన్నాయి. వీటిని పలుమార్లు జీవీఎంసీ నిధులతో అభివృద్ధి చేసింది. అయితే అవి తమవంటూ కొందరు ప్రైవేటు వ్యక్తులు కొన్నేళ్ల కిందట జిల్లా కోర్టులో పిటిషన్ వేశారు. ఆ కేసులో జీవీఎంసీ గెలిచింది. తర్వాత ప్రైవేటు వ్యక్తులు దీనిపై హైకోర్టును ఆశ్రయించగా అక్కడ కూడా జీవీఎంసీయే గెలిచింది. ఇదిలావుండగా వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీకి చెందిన ఒక నేత కళ్లు ఆ రెండు పార్కులపై పడ్డాయి. ఆ పార్కులు తమకు చెందినవంటూ కోర్టుల చుట్టూ తిరుగుతున్న మహిళతో సేల్ అగ్రిమెంట్ చేయించుకున్నారు. తర్వాత ఆ పార్కులను అధికారికంగా కొట్టేసేందుకు తన అధికారబలం ఉపయోగించారు. ఆ స్థలం ప్రైవేటు వ్యక్తులకు చెందినదేనంటూ సర్వే సర్టిఫికెట్ ఇవ్వాలంటూ జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులపై ఒత్తిడి చేశారు. అధికారులు దీనికి సానుకూలంగా ఉన్న సమయంలో ఎన్నికలు రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ఎన్నికల ముందు సదరు నేత కూటమిలోని ఒక పార్టీలో చేరారు. ఇంకేముంది అధికారం చేతిలో ఉండడంతోపాటు అధికారులు కూడా తన మాటకు ఎదురుచెప్పలేని పరిస్థితి ఏర్పడడంతో ఈస్ట్‌పాయింట్ కాలనీలోని రెండు పార్కులను కొట్టేసేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఆ స్థలాన్ని సర్వే చేసిన టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్రైవేటు స్థలంగా నివేదిక ఇచ్చేందుకు అంతా సిద్ధం చేశారు. విషయం స్థానిక కార్పొరేటర్‌కు తెలియడంతో ఇటీవల జరిగిన జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో ఈస్ట్‌పాయింట్ కాలనీలోని రెండు పార్కులను కబ్జాదారుల నుంచి కాపాడాలంటూ ప్లకార్డులు పట్టుకుని కుర్చీపైకెక్కి నినాదాలు చేయడంతో అధికారులు ఉలిక్కిపడ్డారు. దీంతో అప్పటికే పార్కులు రెండు ప్రైవేటు స్థలాలుగా నిర్ధారిస్తూ తయారుచేసిన నివేదికను సదరు ప్రజా ప్రతినిధి చేతికి అందజేసిన అధికారులు...అధికారికంగా ఇవ్వడానికి వెనుకంజ వేశారు. దీంతో పార్కులు జీవీఎంసీ చేతి నుంచి చేజారిపోయే ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్‌పడింది.



రేసపువానిపాలెం సర్వే నంబర్ 37/2లో ఉన్న రాజేంద్రనగర్ పార్కు

ప్రైవేటు ఆస్తిగా రాజేంద్రనగర్ పార్కు

రేసపువానిపాలెం సర్వే నంబర్ 37/2లో ఉన్న రాజేంద్రనగర్ పార్కు తనదంటూ ఒకరు కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు అందులో 1,452 గజాలు శ్రీనివాసరెడ్డి అనే వ్యక్తికి చెందినదిగా పేర్కొంటూ సర్టిఫికెట్ జారీచేసేయడం చర్చనీయాంశంగా మారింది. రాజేంద్రనగర్ రెసిడెంట్స్ పేరుతో రేసపువానిపాలెం సర్వే నంబర్ 37లోని 4.4 ఎకరాల్లో హెచ్‌పీసీఎల్ తమ సంస్థ ఉద్యోగుల కోసం 1962, 1971లో రెండు లేఅవుట్‌లు వేసింది. అందులో 1.7 ఎకరాలను పార్కుగా మార్కింగ్ చేసింది. అయితే పార్కుగా మార్కింగ్ చేసిన స్థలం తమదంటూ ఒక వ్యక్తి కొంతకాలంగా న్యాయపోరాటం చేస్తున్నారు. దీనిపై రెండుసార్లు హైకోర్టులో కేసులు వేయగా రెండుసార్లు జీవీఎంసీయే గెలుచుకుంది. అయితే వైసీపీ హయాంలో సదరు ప్రైవేటు వ్యక్తి జీవీఎంసీ కౌన్సిల్‌లో కీలకంగా వ్యవహరించిన సీనియర్ కార్పొరేటర్‌తోపాటు మరొక మహిళా కార్పొరేటర్ సహకారంతో పార్కులోని 1,452 గజాల స్థలం కొట్టేయడానికి స్కెచ్ వేశారు. వారిద్దరూ జీవీఎంసీ అధికారులపై ఒత్తిడి చేసి ప్రైవేటు స్థలంగా పేర్కొంటూ టౌన్‌ప్లానింగ్

... మిగతా 6వ పేజీలో



హనుమంతవాక జంక్షన్ వద్ద ట్రాఫిక్ (ఫైల్ ఫొటో)

ట్రాఫిక్ నియంత్రణకు ఏఐ

- ట్రాఫిక్ ఉల్లంఘనకు పాల్పడేవారి వాహనాలకు జరిమానాల విధింపు, ట్రాఫిక్ రద్దీని బట్టి సిగ్నల్స్ పడడం వంటి సేవలు అందుబాటులోకి...
- నాలుగు సంస్థలు ఆసక్తి...
- రెండు రోజుల క్రితం ఉన్నతాధికారులకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్
- తక్కువ మొత్తానికి టెండర్ వేసే సంస్థకు అప్పగింత

విశాఖపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి):

నగరంలో త్వరలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారంగా పని చేసే ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ అందుబాటులోకి రానున్నది. ఇందుకోసం పోలీస్ శాఖ, జీవీఎంసీ సంయుక్తంగా ప్రణాళికలు రూపొందించాయి. ఈ మేరకు నగరవ్యాప్తంగా ఉన్న సిగ్నల్స్ వద్ద ఏఐ ఆధారిత కెమెరాలను ఏర్పాటుచేసి, వాటిని నిర్వహించేందుకు ఆసక్తి గల సంస్థల నుంచి జీవీఎంసీ ప్రతిపాదనలను ఆహ్వానించింది. నోయిడాకు చెందిన మెటాఫ్యూజన్, బెంగళూరుకు చెందిన డేటా కార్ట్, హైదరాబాద్‌కు చెందిన బృహస్పతి టెక్నాలజీస్, ముంబైకి చెందిన సీఎంఎస్ కంప్యూటర్స్ సంస్థలు ఆసక్తి కనబరిచాయి. ఆయా సంస్థల ప్రతినిధులు నగరానికి వచ్చి జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిరప్రసాద్, ఎంపీ ఎం.శ్రీభరత్ సమక్షంలో ఈనెల నాలుగున పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఏఐ ట్రాఫిక్ సిగ్నల్స్ పనితీరు, వాటివల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఏఐ ఆధారిత ట్రాఫిక్ సిగ్నల్స్ అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ ఉల్లంఘనకు పాల్పడేవారి వాహనాలకు సంబంధించిన ఫొటోలను తీసి, వాటి ఆధారంగా ఈ-చలాన్ ద్వారా జరిమానాలను విధించడం, ట్రాఫిక్ రద్దీని బట్టి సిగ్నల్స్ పడడం, అప్‌లోడ్ చేసిన సాఫ్ట్‌వేర్ ఆధారంగా పాత నేరస్థులు ఎవరైనా రోడ్లపై కనిపిస్తే వారి ఫొటోలను తీసి సమాచారాన్ని పోలీస్ కమాండ్ కంట్రోల్‌రూమ్‌కు చేరవేయడం, ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే రోడ్ల వివరాలను కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా నగరంలో ప్రయాణించే వారికి తెలియజేయడంతోపాటు ప్రత్యామ్నాయ రోడ్ల వివరాలను సూచించడం వంటి సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ వివరించారు. తక్కువ మొత్తానికి ఏఐ ఆధారిత ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు, నిర్వహణకు ముందుకువచ్చే సంస్థకు పనులు అప్పగిస్తామని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, సీపీ పేర్కొన్నారు. వీలైనంత త్వరగా ఏఐ ట్రాఫిక్ సిస్టమ్‌ను నగరంలో అందుబాటులోకి తెస్తామన్నారు. ఈ సిస్టమ్ అందుబాటులోకి వస్తే నగరంలో ట్రాఫిక్ ఉల్లంఘనలకు అడ్డుకట్టపడి, రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయని నగరవాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పోలీసులకు కూలింగ్ హెల్మెట్లు, డ్రోన్లు



సౌత్ ఏషియా ఎల్పీజీ సంస్థ, విశాఖ పోర్టు అందజేసిన కూలింగ్ హెల్మెట్లు, డ్రోన్లను మంత్రి అనిత సోమవారం పోలీసు సిబ్బందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డ్రోన్ ఎగురవేస్తున్న దృశ్యం. - 8లో

జగన్నాథుడికి నీరాజనం



టౌన్ కొత్తరోడ్డులోని జగన్నాథస్వామి మారు రథయాత్ర సోమవారం భక్తజన నీరాజనాల మధ్య సందడిగా జరిగింది. టర్నర్ చౌల్ట్రీ నుంచి స్వామి తిరిగి ఆలయానికి చేరుకోవడంతో పదిరోజుల రథయాత్ర ఉత్సవాలు ముగిశాయి. - 8లో

సింహగిరి ప్రదక్షిణ రేపే

- రెండు రోజులపాటు దేవస్థానంలో ఆర్జిత సేవలు రద్దు

సింహాచలం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సింహగిరి ప్రదక్షిణను బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించనున్నారని దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు. ఉత్సవ ఏర్పాట్లపై సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయన ఇచ్చిన వివరాల ప్రకారం...కొండదిగువన తొలిపావంచా వద్ద ప్రారంభమయ్యే పుష్ప రథం అడివివరం, ముడసర్లోవ, హనుమంతువాక, విశాలాక్షి నగర్, జోడుగుళ్లపాలెం, ఎం.వి.పి.డబుల్ రోడ్డు, వెంకోజీపాలెం, సీతమ్మధార, బాలయ్యశాస్త్రి లే అవుట్, మాధవధార, మురళీనగర్, కుమారి కల్యాణమండపం, పాతగోశాల మీదుగా తిరిగి తొలిపావంచాకు చేరుకుంటుంది. పౌర్ణమి అనగా ఈనెల పదో తేదీ...గురువారం ఉదయం 5.30 గంటల నుంచి భక్తులకు స్వామివారి దర్శనాలు కల్పిస్తారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని 9, 10 తేదీల్లో అప్పన్న ఆలయంలో అన్ని ఆర్జిత సేవలను రద్దు చేశారు. భక్తుల రద్దీ నియంత్రణలో భాగంగా రెండు రోజులు మెట్లమార్గంలో భక్తులను కొండ దిగువకు రాకుండా నిలుపుదల చేసి, దేవస్థానం ఉచిత బస్సుల ద్వారా చేరవేస్తారు. అలాగే కొండపైన క్యూలు, కేశఖండనశాల, బస్టాండ్, గంగధార, ఇతర రద్దీ ప్రదేశాల్లో అవాంఛనీయ ఘటనలు, తోపులాటలు, చోటుచేసుకోకుండా ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేస్తున్నారు. గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులకు వైద్య సహాయం కోసం మార్గం పొడవునా 30 తాత్కాలిక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. గిరి ప్రదక్షిణ మార్గంలో మద్యం దుకాణాలు మూసివేయించేందుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ చర్యలు తీసుకుంటుంది. ఆర్టీసీ ఆధ్వర్యంలో తొమ్మిదో తేదీ ఉదయం నుంచి పదో తేదీ సాయంత్రం వరకూ ప్రత్యేక బస్సులు నడపనున్నది.

ఇదిగో...అదిగో...

యుహెచ్-3హెచ్ మ్యూజియం ప్రారంభోత్సవంలో జాప్యం

- ఆరు నెలలుగా ఎదురుచూపులు
- ఆదాయం కోల్పోతున్న వీఎంఆర్‌డీఏ



బీచ్‌రోడ్డులోని యుహెచ్-3 హెచ్ మ్యూజియం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పర్యాటక అభివృద్ధిలో భాగంగా విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) బీచ్‌రోడ్డులో రూ.2.2 కోట్లతో హెలికాప్టర్ మ్యూజియం నిర్మించింది. దీని పనులు ఈ ఏడాది జనవరిలోనే పూర్తయ్యాయి. అయితే ప్రారంభించడానికి రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు తీరిక దొరకడం లేదు. ఆరు నెలల నుంచి ఇదిగో...అదిగో అంటూ వాయిదా వేసుకుంటూ వస్తున్నారు.

టీయూ-142 యుద్ధ విమానం, సీ హ్యారియర్ హెలికాప్టర్ మ్యూజియాన్ని ఆనుకుని...హెలికాప్టర్ మ్యూజియం ఏర్పాటు చేశారు. చుట్టూ అద్దాలు ఏర్పాటుచేసి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. విశాఖపట్నం వచ్చే పర్యాటకులు కురుసుర సబ్‌మెరైన్, టీయూ-142, సీ హ్యారియర్ మ్యూజియాలతో పాటు దీనిని కూడా చూడడానికి ఆసక్తి చూపిస్తున్నారు. అయితే అది ఇంకా ప్రారంభించలేదని అక్కడి సిబ్బంది చెబుతుండడంతో ఉసూరుమంటూ వెనుతిరుగుతున్నారు. దీనివల్ల వీఎంఆర్‌డీఏ ఆదాయాన్ని కూడా కోల్పోతుంది. సీఎం

... మిగతా 6వ పేజీలో

ఉక్కు టౌన్‌షిప్‌లో దొంగల స్వైరవిహారం

- సెక్టార్-6లోని మూడు క్వార్టర్లలో ప్రవేశించి బంగారం, వెండి, నగదు అపహరణ -6వ పేజీలో



బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ప్రైవేటు పాఠశాలలపై సీరియస్

- పేదలకు ఉచితంగా సీట్లు ఇవ్వడానికి నిరాకరించిన 18 విద్యా సంస్థలకు విద్యా శాఖ నోటీసులు
- చర్యలు తప్పవన్న డీఈవో

విశాఖపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి):

విద్యా హక్కు చట్టం కింద పేద వర్గాలకు ఉచితంగా ప్రవేశాలు కల్పించడానికి నిరాకరిస్తున్న ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలపై విద్యా శాఖ సీరియస్ అయ్యింది. ప్రభుత్వ ఆదేశాలు ధిక్కరించిన 18 పాఠశాలలకు నోటీసులు జారీచేసింది. నగరంలో ప్రముఖ పాఠశాలలుగా గుర్తింపు పొందిన లిటిల్ ఏంజిల్స్, టింపనీ, శ్రీప్రకాష్, భాష్యం, సత్యసాయి, యాపిల్, పోలాక్స్...ఇలా మొత్తం 18 పాఠశాలలకు నోటీసులు ఇచ్చింది. నోటీసులతో సరిపెట్టకుండా సంబంధిత మండల విద్యాశాఖాధికారుల ద్వారా ఆయా పాఠశాలల యాజమాన్యాలను రప్పిస్తోంది. రెండు విడతలలో 4,300 మందికి ఉచిత సీట్లు కేటాయించగా, 2,990 మందికి ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలు లభించాయి. మిగిలిన వారిని యాజమాన్యాలు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో సీట్లు ఇవ్వని యాజమాన్యాలతో ఎంఈవోలు మాట్లాడారు. అయినా పలు కారణాలు చూపుతూ సీట్లు ఇవ్వడానికి ఒప్పుకోలేదు. పోలాక్స్ యాజమాన్యంలోని మూడు పాఠశాలల్లో 60 సీట్లు కేటాయించగా, 40 మందికి ఇచ్చి మిగిలిన వారిని తిరస్కరించడంపై విద్యాశాఖ ఆగ్రహం వ్యక్తంచేసింది. సీట్లు ఇవ్వకుంటే చర్యలు తీసుకోవాలన్న ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో 18 పాఠశాలలకు నోటీసులు ఇచ్చామని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ తెలిపారు. విద్యాహక్కు చట్టం ప్రకారం సీట్లు ఇవ్వాల్సిందేనని స్పష్టంచేశారు. ఏదైనా కారణంతో ఒక విద్యార్థికి సీటు నిరాకరించినట్టయితే అన్ని అర్హతలున్న మరో విద్యార్థికి సీటు ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అందుకు కూడా ముందుకురాకపోతే తొలుత నోటీసులు ఇస్తామని, ఆ తరువాత చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ముంతాజ్‌లో నిల్వ ఆహారం

- ఫ్రిజ్‌లో 32 కిలోల చికెన్ ఐటమ్స్
- వేడి చేసి వినియోగదారులకు అందజేస్తున్నట్టు గుర్తించిన ఆహార భద్రత, ప్రమాణాల శాఖ అధికారులు
- కేసు నమోదు



ముంతాజ్ హోటల్‌లో తనిఖీలు చేస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అప్పారావు.. గుర్తించిన నిల్వ ఆహారం

విశాఖపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి):

నగరంలోని నరసింహనగర్‌లో గల ముంతాజ్ హోటల్‌లో రోజుల తరబడి ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన ఆహారాన్ని ఆహార భద్రతా, ప్రమాణాల శాఖ అధికారులు సోమవారం గుర్తించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా హోటల్‌కు వెళ్లిన అధికారులు సుమారు 32 కిలోల చికెన్ ఐటమ్స్‌ను ఫ్రిజ్‌లో నిల్వ చేసినట్టు గుర్తించారు. ఇందులో చికెన్ ఫ్రై పీస్, జాయింట్స్ వంటివి ఉన్నాయి. ఆయా ఆహార పదార్థాలను బయట పడేయించారు. చికెన్ పదార్థాలను నిల్వ చేసినట్టు నిర్ధారణ కావడంతోపాటు సిబ్బంది కూడా అంగీకరించడంతో కేసు నమోదు చేసినట్టు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ జీవీ అప్పారావు తెలిపారు.

హోటళ్లకు వెళుతున్నారా జాగ్రత్త..

నగర పరిధిలోని అనేక హోటళ్లలో ఇదే పరిస్థితి ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. మిగిలిపోయిన ఆహార పదార్థాలను రోజుల తరబడి నిల్వ ఉంచి, వాటినే మళ్లీ వేడి చేసి వినియోగదారులకు

... మిగతా 6వ పేజీలో



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

128 మందికి వైద్య పరీక్షలు

తగరపువలస, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ రెండవ వార్డు చిల్లపేటలోని బొగ్గు రోడ్డు సచివాలయం వద్ద స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో టీబీ ముక్తభారత్ కార్యక్రమంలో భాగంగా సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి కె. సుస్మిత 128 మంది రోగులను పరీక్షించి, మందులు అందించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, రాత్రి పూట చెమటలు పట్టడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిబి సూపర్‌వైజరు చక్రవర్తి, పీహెచ్‌సీ సిబ్బంది ప్రేమ్‌కుమార్, పద్మజారాణి, వై. హరి, టీడీపీ నాయకులు కృష్ణారావు, సూరిబాబు, రాంబాబు పాల్గొన్నారు.

103 దరఖాస్తులు స్వీకరణ



దరఖాస్తులు అందిస్తున్న జూట్ కార్మికులు

తగరపువలస, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : చిట్టివలస జూట్‌మిల్లు యాజమాన్యం కార్మికులకు పరిహారాల చెల్లింపునకు ఏర్పాటు చేసిన కౌంటర్‌లో సోమవారం ఒక్క రోజే 103 దరఖాస్తులు అందాయి. ఆదివారం సెలవు కావడంతో మరుసటి రోజు దరఖాస్తులు ఇవ్వడానికి కార్మికులు బారులు తీరారు. మిల్లు క్వార్టర్లలో ఉంటున్న వారు విద్యుత్ సదుపాయం కోసం మీటర్ ఏర్పాటుకు రూ. వెయ్యి చొప్పున గతంలో యాజమాన్యానికి చెల్లించారు. ఆ సొమ్మును తిరిగి చెల్లిస్తామని ప్రకటించడంతో 21 మంది దరఖాస్తు చేసుకున్నారు. అలాగే వివిధ సమస్యలపై 82 దరఖాస్తులు అందాయని కౌంటర్ సిబ్బంది తెలిపారు.

క్రీడాకారులకు దుస్తులు పంపిణీ



క్రీడాకారులతో టీచర్స్ హెల్ప్ సంస్థ సభ్యులు

భీమునిపట్నం (రూరల్), జూలై 7 (ఆంధ్రజ్యోతి) : పోలమాంబ వేసవి శిక్షణ శిబిరంలో ఫుట్‌బాల్ నేర్చుకున్న క్రీడాకారులకు టీచర్స్ హెల్ప్ సంస్థ సోమవారం దుస్తులు పంపిణీ చేసింది. స్థానిక ఫుట్‌బాల్ క్రీడామైదానంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దాతలు టీషర్టులు, షార్టులు అందించారు.కార్యక్రమంలో ఫుట్‌బాల్ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు రామునాయుడు, చినబాబు, కోచ్ చిన్నారెడ్డి, ఎ.శివ, క్రీడాకారులు చంద్రశేఖర్, అప్పారావు, జె. అప్పలకృష్ణ పాల్గొన్నారు.

కార్మిక పింఛన్‌దారుల సమావేశం

తగరపువలస, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : కర్మాగారాల్లో పని చేసి రిటైర్ అయిన కార్మికులకు ప్రభుత్వం హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కార్మిక పింఛనుదారుల సంఘం డిమాండ్ చేసింది. సోమవారం వారు స్థానిక జీఆర్ భవన్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి. బాబాజీ మాట్లాడుతూ చాలామంది రిటైర్డ్ కార్మికులకు నెలకు రూ. వెయ్యి పింఛన్ మాత్రమే అందుతుందని, ప్రభుత్వం ఈ మొత్తాన్ని పెంచడంతో పాటు హెల్త్ కార్డులు మంజూరు చేయాలన్నారు. అలాగే ఈనెల 9న జరిగే సార్వత్రిక సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కె. రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సహాయ కార్యదర్శి ఎం. అప్పలరాజు, ఉపాధ్యక్షుడు చిల్ల అప్పారావు, ఏఐటీయూసీ నాయకులు నాయుడు, చిల్ల రామపైడయ్య, అల్లం గోవిందరావు, లక్ష్మణరావు, సన్నిబాబు పాల్గొన్నారు.

జాలర్ల చేతికి కలగడ పార చేపలు



భీమునిపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : భీమిలి తీరంలో జాలర్ల గేలాలకు కలగడ పార రకం చేపలు పడుతున్నాయి. సాధారణంగా గేలాలకు చిన్న చిన్న చేపలు పడుతుంటాయి. కానీ వారం రోజులుగా కలగడ పార చేపలు పడుతున్నాయి. ఇవి ఒక చేప ఖరీదు రూ. 2,500 నుంచి రూ. 3,500 వరకూ ఉంటుంది. వాస్తవానికి ఇవేమి అరుదైన చేపలు కాదు. సముద్రం లోపలికి వెళ్తే మత్స్యకారులకు దొరుకుతుంటాయి. కానీ కెరటాల ఒడ్డున ఉండి గేలాలు వేసుకుని జీవించే జాలర్ల దొరకడం చాలా అరుదు.

చంద్రంపాలెంలో ఎన్‌సీసీ ఎంపికలు



విద్యార్థులను ఎంపిక చేస్తున్న ఆర్మీ సిబ్బంది

కొమ్మాది, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం ఎన్‌సీసీ ఎంపిక పరీక్షలు నిర్వహించారు. 300 మంది బాలురు, 150 మంది బాలికలు పాల్గొనగా 42 మంది బాలురు, 20 మంది బాలికలను ఆర్మీ సిబ్బంది ఎంపిక చేసినట్టు పాఠశాల హెచ్‌ఎం వెంకటరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీ అప్పలనాయుడు, ఆర్మీ సిబ్బంది శ్యామలరావు, మహేందర్, శుక్రరాజ్, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదులో బీఎల్‌ఓల పాత్ర కీలకం

పద్మనాభం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతిఒక్కరిని ఓటరుగా నమోదు చేయడంలో బీఎల్‌ఓలు కీలకపాత్ర పోషించాలని ఆర్‌డీఓ కె. సంగీత మాధుర్ చెప్పారు. పద్మనాభంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన బూత్ లెవెల్ అధికారుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఓటర్లను నమోదు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండి వివరాలు సేకరించాలన్నారు. నేరుగా వచ్చిన దరఖాస్తులతో పాటు ఆన్‌లైన్‌లో వచ్చే ఫారం-6, 7, 8లను తగిన రీతితో విచారణ చేసి ఓటర్ల చేర్పుతో పాటు సవరణలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా 18 ఏళ్లు నిండిన వారికి ఓటుహక్కు కల్పించడంలో ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. అలాగే ఓటర్ల జాబితాలో మరణించిన వారి ఓట్లు తొలగించడంపై కూడా ప్రత్యేక దృష్టిసారించాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దారు కె. ఆనందరావు, ఎలక్షన్ డీటీ నియోగి, ఎస్‌ఏ మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్సవ వైఫల్యాలను భక్తులు క్షమించరు

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- తొలిపావంచా వద్ద షెడ్ కూలిన ప్రదేశం పరిశీలన



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

సింహాచలం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి వార్షిక ఉత్సవాల్లో అధికారుల వైఫల్యాల వల్ల ప్రమాదాలు చోటుచేసుకోవడాన్ని భక్తులు క్షమించరని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. సింహగిరి ప్రదక్షిణ ఏర్పాట్లలో భాగంగా కొండదిగువ తొలిపావంచా వద్ద వేసిన రేకుల షెడ్ కూలిపోయిన ప్రదేశాన్ని కార్పొరేటర్ నరసింహంతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ షెడ్ కూలిన ఘటనకు దేవస్థానం పూర్తి బాధ్యత వహించాలన్నారు. దేవస్థానంలో ఈఈలు,డీఈలు, ఏఈలు, ఇతర ఆలయాల నుంచి డిప్యుటేషన్‌పై వచ్చిన అధికారులు ఉన్నా.. షెడ్ కూలిపోవడం క్షమించరాని నేరమని చెప్పారు. పనులను అధికారులు శ్రద్ధతో పర్యవేక్షించాల్సి ఉందని, ప్రమాదం జరిగినప్పుడు ఆ కారణాన్ని కాంట్రాక్టర్‌పై నెట్టడం సరికాదన్నారు.ఇంతపెద్ద ఆలయంలో ఏడాదిలో రెండు మూడు ఉత్సవాలు కూడా సక్రమంగా నిర్వహించలేకుంటే చరిత్ర క్షమించదని, ఈ అంశాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుందన్నారు. ఏర్పాట్లు జరుగుతున్న దశలోనే షెడ్ కూలిందంటే ఉత్సవం రోజున ప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. తొలిపావంచా వద్ద శాశ్వత షెడ్ నిర్మించే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు ఆయన చెప్పారు.

ఎన్నికల హామీలు నెరవేరుస్తాం

ఎన్నికల్లో ఇచ్చిన హామీలనీ ప్రభుత్వం నెరవేరుస్తుందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. కార్పొరేటర్ నరసింహం సారధ్యంలో సోమవారం సింహాచలంలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అర్హులందికీ పింఛన్లు, తల్లికి వందనం, ఇళ్లు అందిస్తామన్నారు. వార్డులో ప్రధాన సమస్యల్లో ఒకటైన బీఆర్‌టీఎస్ టీడీఆర్ అంశం, దానికి చెందిన సేల్ ఆప్షన్‌కు పరిష్కారం చూపుతామని తెలిపారు. అలాగే సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న పంచ గ్రామాల భూ వివాదం కూడా పరిష్కారమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, నాయకులు సిరిపురపు సురేశ్, పట్నాల ధర్మరాజు, ఎంకే గోపాల్, బూర్లె కనకరాజు, మజ్జి చంద్ర శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

గాయత్రినగర్‌లో...

కొమ్మాది : రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనతోనే సాధ్యమని టీడీపీ విశాఖ పార్లమెంట్ తెలుగు యువత నాయకుడు గరే గురునాథ్ అన్నారు. పీఎంపాలెంలోని గాయత్రినగర్‌లో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు రెడ్డి సత్యనారాయణ, పోతిన రఘు, నాగోతి వెంకట్రావు, కొప్పాక రామకృష్ణ, పోతిన నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలోనే ప్రజల మన్ననలు పొందిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. మూడో వార్డు తోటవీధిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చురకల రమణ,బొడ్డు రమేష్, నాగరాజు, సంజీవకుమార్, అప్పన్న, సత్యారావు, వియ్యపు పోతురాజు, మురళి పాల్గొన్నారు.

అనారోగ్యంతో పోలీసు జాగిలం మృతి

అధికార లాంఛనాలతో అంత్యక్రియలు



జిక్కికి నివాళి అర్పిస్తున్న పోలీసులు

ఎండాడ, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : కైలాసగిరిలో ఉన్న ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు శాఖలో ఏడేళ్ల పాటు సేవలందించిన పోలీసు జాగిలం జిక్కి అనారోగ్యంతో చికిత్స పొందుతూ సోమవారం తుది శ్వాస విడిచింది. జిక్కి మృతి పట్ల అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా సంతాపం వ్యక్తం చేసి, అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించేందుకు ఆదేశించారు. ఈమేరకు ఆర్మ్‌డ్ రిజర్వు డీఎస్పీ సి. నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, అరవింద్ కిశోర్, మన్మథరావు, రమణమూర్తి, సంజీవరావు, ఎస్‌ఐలు, సిబ్బంది జిక్కి భౌతికాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జోడుగుళ్లపాలెం శ్మశాన వాటికలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. కాగా జిక్కి బెల్జియం మెలనాయిస్ జాతికి చెందినది. 2018లో విజయవాడ ఆరో బెటాలియన్ డాగ్ స్క్వాడ్ శిక్షణ కేంద్రంలో ఏఆర్‌పీసీ 174 జేయూ ఎంవీ ప్రసాదరావు నేతృత్వంలో ట్రాకర్‌గా శిక్షణ పొందింది. వాసన ఆధారంగా గల్లంతైనా వారి సొత్తులు, నిందితుల తాలుక ఆధారాలను గుర్తించడంలో అద్భుత ప్రతిభ కనబరిచింది. లా అండ్ కేసుల దర్యాప్తులో, చెక్ పోస్టు తనిఖీల్లో, స్వాతంత్ర్య దినోత్సవం వంటి ముఖ్యమైన సందర్భాల్లో నిర్వహించే పోలీసు పరేడ్‌లో పాల్గొని తన విన్యాసాలతో అందరి ప్రశంసలు పొందింది.

నేడు ఉచిత వైద్య శిబిరం

భీమునిపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామచంద్రమూర్తి జన్మదినోత్సవం సందర్భంగా చిన్నబజారు డచ్‌రోడ్‌లో వున్న ఆ సంస్థ కార్యాలయంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. సోమవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు.

ఘనంగా క్రికెటర్ దోనీ జన్మదిన వేడుకలు

భీమునిపట్నం (రూరల్), జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ క్రికెట్ ఎంఎస్ దోనీ జన్మదిన వేడుకలు మద్దిలపేట గ్రామంలో సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గ్రామ కూడలిలో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి గ్రామానికి చెందిన క్రికెట్ అభిమానులు కేక్ కట్ చేసి గ్రామస్తులకు స్వీట్లు పంచారు.

సమ్మెను విజయవంతం చేయాలని ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

ఆనందపురం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా ఈనెల 9న జరిగే సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ సీఐటీయూ భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో వేములవలస నుంచి పూల మార్కెట్ వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీటూ జోన్ అధ్యక్షుడు ఆర్.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ కేంద్రం తీసుకున్న నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగ కార్మికుల కోసం సమగ్ర చట్టాన్ని తీసుకురావాలని, కనీస వేతనం రూ.26,000 అమలు చేయాలన్నారు. ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడనాడాలని పేర్కొన్నారు. జోన్ కార్యదర్శి ఎస్. అప్పలనాయుడు మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయడానికి కుట్ర చేస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు నేలతి రాము, పల్ల పోతురాజు, సత్యన్నారాయణ, బంగారునాయుడు, అప్పలనాయుడు, శరత్‌చందర్ పాల్గొన్నారు.



ప్లాన్‌ను పరిశీలిస్తున్న సీఈ శేఖర్

గిరిప్రదక్షిణ ఏర్పాట్లు పరిశీలన

సింహాచలం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : సింహగిరి ప్రదక్షిణ పురస్కరించుకుని దేవదాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ఏర్పాట్లను ఆ శాఖ రాష్ట్ర ముఖ్య ఇంజినీర్ జేవీవీ శేఖర్ సోమవారం పరిశీలించారు. తొలుత ఆయన స్వామిని దర్శించుకున్నారు. అనంతరం గిరి ప్రదక్షిణకు ఏర్పాటు చేస్తున్న ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, క్యూలైన్లను పరిశీలించారు. అలాగే ఆలయ ఇంజినీర్లు రూపొందించిన ప్రణాళికను పరిశీలించి మార్పులు చేర్పులను సూచించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఈ వెంకటరమణ, అన్నవరం దేవాలయ ఈఈ రామకృష్ణ, విజయవాడ ఈఈ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఐబీడీపీ ఫలితాల్లో ఓక్రిడ్జి విద్యార్థుల ప్రతిభ

భీమునిపట్నం (రూరల్), జూలై 7 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించిన బాకలోరియల్ డిప్లొమా ప్రోగ్రాం (ఐబీడీపీ) ఫలితాల్లో సింగనబంద ఓక్రిడ్జి అంతర్జాతీయ పాఠశాల విద్యార్థుల అద్భుత ప్రతిభ చూపారు. పరీక్షల్లో 45 మార్కులకు 41 సాధించి పాఠశాల విద్యార్థి పి. రుత్విక్ ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ ఏడాది పరీక్షకు హాజరైన విద్యార్థుల సగరు స్కోరు 32.7 శాతంగా నమోదైంది. ప్రతి సబ్జెక్టులోనూ సగటున గ్రేడ్ 4.8 శాతంగా విద్యార్థులు ఫలితాలు సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ శైలా భమిడిపాటి తెలిపారు.



కృష్ణమయ్యకు పూజలు చేస్తున్న వైదికులు

కృష్ణమయ్య సంఘ సంస్కరణల ఆద్యుడు

సింహాచలం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామిని తన సంకీర్తనల గానంతో నర్తింపజేసిన ప్రథమాంధ్ర వచన సంకీర్తనాచార్యులు కాంతా కృష్ణమయ్య సంఘ సంస్కరణల ఆద్యుడు అని అప్పన్న ఆలయ స్థానాచార్యులు డా. టీపీ రాజగోపాల్ అన్నారు. సోమవారం కృష్ణమయ్య జయంతి పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. బేడా మండపంలోని కృష్ణమయ్య విగ్రహం వద్ద షోడశోపచారాల పూజల తరువాత కృష్ణమయ్య వచన సంకీర్తనల గానం చేశారు. అనంతరం సంకీర్తనల విశిష్టతలను స్థానాచార్యులు వివరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఏఈఓ ఆనందకుమార్, ప్రధానార్చకుడు కరి సీతారామాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

క్లీనికల్ రీసెర్చిపై అవగాహన సదస్సు

సాగర్‌నగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఫార్మసీ చదువుతున్న వారికి క్లీనికల్ రీసెర్చిలో ఉపాధి అవకాశాలపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పూణెకు చెందిన క్లీనోవీ రీసెర్చి ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్ డాక్టర్ రాధిక ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

వలందపేటలో సీసీ రోడ్డు నిర్మించాలని వినతి

భీమునిపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వలందపేటలో సీసీ రోడ్డు నిర్మించాలని ఆప్రాంత ప్రజలు కోరారు. సోమవారం వారు జోన్ వన్ కార్యాలయంలో జడ్సీ అయ్యప్ప నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ గ్రామంలో సర్వే నంబరు 27/2లో ఇళ్లు నిర్మించుకున్న వారు కొంతభూమిని రహదారి నిర్మాణానికి స్వచ్ఛందంగా విడిచిపెట్టారని, అక్కడ 20 అడుగుల సీసీ రోడ్డు నిర్మించాలని విన్నవించారు.. కార్యక్రమంలో లచ్చుబుగత గణపతి, కె. పద్మావతి, ఎం. ఫాల్గుణరావు, లీలాకుమారి, ఎంవీ రత్నం పాల్గొన్నారు. కాగా పీజీఆర్‌ఎస్‌కు మొత్తం ఆరు అర్జీలు అందా యని జోనల్ కార్యాలయం అధికారులు తెలిపారు. యూసీడీ విభాగానికి 2, ఇంజనీరింగ్ విభాగానికి 3, పట్టణ ప్రణాళిక విభాగానికి 1 దరఖాస్తు వచ్చిందని చెప్పారు.

22 వినతులు

కొమ్మాది : జీవీఎంసీ ఆరో వార్డులోని హెచ్‌బీ కాలనీ, ఏడో వార్డులో గణేష్‌నగర్‌లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, మరమ్మతులు చేపట్టాలని పౌర సంక్షేమ సంఘం సభ్యులు కోరారు. సోమవారం వారు జోన్-2 కార్యాలయంలో జరిగిన పీజీఆర్‌ఎస్‌లో జడ్సీ కనక మహాలక్ష్మికి వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్లు గోతులతో ఉండడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కాగా పీజీఆర్‌ఎస్‌కు 26 వినతులు వచ్చాయని జడ్సీ తెలిపారు.

రేపు జడ్పీ సర్వసభ్య సమావేశం

విశాఖపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశాన్ని చైర్‌పర్సన్ అధ్యక్షతన ఈ నెల తొమ్మిదో తేదీన జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశా మని ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.నారాయణ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభ మవుతుందని, జిల్లా ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, ఎంపీపీలు, అధికారులు అందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

ఉక్కు టౌన్‌షిప్‌లో దొంగల స్వైరవిహారం

సెక్టార్-6లోని మూడు క్వార్టర్లలో ప్రవేశించి

బంగారం, వెండి, నగదు అపహరణ

ఉక్కుటౌన్‌షిప్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటు టౌన్‌షిప్‌లో దొంగలు హల్‌చల్ చేశారు. మూడు క్వార్టర్లలో ప్రవేశించి నగదు, బంగారం, వెండి ఎత్తుకుపోయారు స్టీల్ ప్లాంటు క్రైమ్ పోలీసులు సోమవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సెక్టార్-6లోని 335-డీ క్వార్టర్‌లో ఉంటున్న ఎస్ఎంఎస్-2 విభాగం సీనియర్ టెక్నీషియన్ సీహెచ్‌ఈ రాజ్‌కుమార్ ఈ నెల ఐదో తేదీన కుటుంబంతో కలిసి అత్తవారింటికి వెళ్లారు. సోమవారం పొరుగునున్న సత్యనారాయణ ఆయనకు ఫోన్ చేసి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని సమాచారం అందించారు. దీంతో వారు వచ్చి చూడగా..ఇంట్లో ఉంచిన 3 తులాల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు, 70 తులాల వెండి సామగ్రి చోరీకి గురైనట్టు గురించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే సెక్టార్‌లోని 327-డి క్వార్టర్‌లో నివసిస్తున్న పి.రాధాకృష్ణ సెక్టార్-6 కాంప్లెక్స్‌లో టిఫిన్ షాపు నడుపుతున్నారు. ఆదివారం రాత్రి ఆయన తమ ఇంటి వద్ద బైకు పార్కింగ్ చేశారు. సోమవారం ఉదయం తన బైకు కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. అలాగే మరో క్వార్టర్‌లో ఓ ప్లాంట్ ఉద్యోగి ఉంటున్నారు. ఆయన లేని సమయంలో ఇంట్లో దొంగలు ప్రవేశించి 45 గ్రాముల బంగారం, లక్ష నగదు చోరీ చేసినట్టు తెలిసింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందాల్సి ఉంది. కాగా మరో క్వార్టర్‌లో నివసిస్తున్న ఎస్ఐ ఇంటి తలుపులు విరగ్గొట్టి లోపలకు వెళ్లిన దొంగలు...లోపల పోలీసు దుస్తులు చూసి అక్కడ నుంచి పరారైనట్టు తెలిసింది. క్రైమ్ సీఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమెరికాలో రోడ్డు ప్రమాదం

- భీమిలి నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ కుమార్తె మృతి



విషాదంలో కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్లో) మృతురాలు శివాన్విత



భీమునిపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భీమిలి నియోజకవర్గ బీజేపీ కన్వీనరు కంటుభుక్త రామానాయుడు ద్వితీయ కుమార్తె శివాన్విత (19) దుర్మరణం చెందారు. ఈనెల 4వ తేదీన ఈ సంఘటన జరిగింది. అమెరికాలోని కాలిఫోర్నియాలో తన అక్కతో పాటు శివాన్విత కూడా ఉండి చదువుకుంటున్నారు. శాండియాగో యూనివర్సిటీలో సైకాలజీలో గ్రాడ్యుయేషన్ చదువుతున్న ఆమె గ్రంథాలయానికి వెళ్లి వస్తానని చెప్పి, ప్రమాదానికి గురైంది. కాగా రామానాయుడు దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె ఎంబీబీఎస్ చేస్తుండగా, చిన్న కుమార్తె గ్రాడ్యుయేషన్ చదువుతున్నారు. రామానాయుడు భార్య సునీత బీజేపీ డివిజన్ అధ్యక్షురాలిగా ఉన్నారు. యువతి మృతితో స్థానికంగా విషాదం నెలకొంది.

డివైడర్ మధ్యలో మొక్కలు కనుమరుగు



మధురవాడ, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఏడో వార్డులోని మిథిలాపురి వుడాకాలనీ రహదారి మధ్యలో వేసిన మొక్కలు కనుమరుగయ్యాయి. గతంలో ఈ రహదారిలో వేసిన మొక్కలు పచ్చదనంతో కనువిందుచేసేవి. మిథిలాపురి వుడాకాలనీ నుంచి వాంబే కాలనీకి వెళ్లే ఈ మార్గం ఎంతో ఆహ్లాదకరంగా కనిపించేది. కిలోమీటరు పొడవున ఈ డివైడరు ఉంటుంది. నిర్వహణ లోపం వల్ల ప్రస్తుతం ఈ రోడ్డులో ఒక మొక్క కూడా కనిపించడం లేదు.

పార్కులు అన్యాక్రాంతం!

... 5వ పేజీ తరువాయి

విభాగంలోని సర్వేయర్ ద్వారా సర్టిఫికెట్ సంపాదించాలని యత్నించినా అధికారులు రకరకాల కారణాలతో పెండింగ్‌లో ఉంచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాజీ ఎమ్మెల్యే ఒకరిని ఇద్దరు వైసీపీ కార్పొరేటర్లు కలిశారు. రాజేంద్రనగర్ పార్కు డీల్‌ను వివరించారు. దీనికి ఆయన కూడా అంగీకరించడంతో అధికారులపై ఒత్తిడి చేసి ప్రైవేటు స్థలంగా సర్వే రిపోర్టు సంపాదించేశారు. ఆ సర్వే సర్టిఫికెట్ ఆధారంగా ఖాళీ స్థలం పన్ను (వీఎల్‌టీ) విధించాలంటూ సదరు ప్రైవేటు వ్యక్తి జీవీఎంసీకి దరఖాస్తు చేసుకోగా జోన్-3 రెవెన్యూ అధికారులు జోనల్ కమిషనర్‌కు పంపించారు. జోనల్ కమిషనర్ కూడా వీఎల్‌టీ విధించేందుకు సమ్మతిస్తూ డీసీఆర్‌కు పంపించారు. ఆ ఫైల్‌లో కొన్ని లొసుగులు ఉన్నట్టు గుర్తించిన డీసీఆర్ ఆ స్థలాన్ని మరోసారి సర్వే చేసి అందులో ప్రభుత్వ భూమి ఏమైనా ఉందా?, లేదా? అని నిర్ధారిస్తూ సర్టిఫికెట్ జత చేయాలని కోరుతూ వెనక్కి పంపించేశారు. దీంతో సదరు ప్రైవేటు వ్యక్తి తన స్థలానికి వీఎల్‌టీ విధించాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించాలంటూ టౌన్ సర్వేయర్ ఇచ్చిన సర్టిఫికెట్ ఆధారంగా హైకోర్టును ఆశ్రయించారు. కేసు హైకోర్టులో ప్రస్తుతం పెండింగ్‌లో ఉంది. అదేవిధంగా జీవీఎంసీ ఐదో వార్డు పరిధి బొట్టవానిపాలెంలోని ఈడబ్ల్యూఎస్ లేవుట్‌లోని ఐదెకరాల పార్కు స్థలంలో రెండు ఎకరాలను కొందరు కబ్జా చేసి పాకలు వేసినా అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అదే వార్డులో సాయినగర్ పార్కు స్థలం తమదని పరిహారంగా తమకు టీడీఆర్ జారీచేయాలంటూ ప్రైవేటు వ్యక్తులు జీవీఎంసీకి దరఖాస్తు చేశారు.

ఇదిగో...అదిగో...

... 5వ పేజీ తరువాయి

చంద్రబాబునాయుడుతో పాటు ఐటీ శాఖ మంత్రి లోకేశ్, పురపాలక శాఖ మంత్రి నారాయణ తరచూ నగరానికి వస్తున్నారు. పది నిమిషాలు తీరిక చేసుకుంటే దీని ప్రారంభోత్సవం జరిగిపోతుంది. పర్యాటకులకు అందుబాటులోకి వస్తుంది. దీనిపై తక్షణమే తగిన నిర్ణయం తీసుకొని ఈ మ్యూజియాన్ని పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావలసి ఉంది.

పదిహేడేళ్లు సేవలు

యుహెచ్-3 హెచ్ హెలికాప్టర్ నేవీలో పదిహేడేళ్లు సేవలు అందించింది. తీర ప్రాంత రక్షణ, విపత్తు సమయాల్లో సహాయక చర్యలు, సముద్రంలో తప్పిపోయిన వారిని గుర్తించి, రక్షించడం వంటి విధులు విజయవంతంగా నిర్వహించింది. గత ఏడాది జూన్ 28వ తేదీన ఐఎన్ఎస్ డేగాలో డీ కమిషనింగ్ జరిగింది. జిల్లాకు ఇస్తామని మ్యూజియంగా మార్చాలని తూర్పు నౌకాదళం కోరగా కలెక్టర్ అంగీకరించారు. దానికి అవసరమైన 23 సెంట్ల స్థలాన్ని బీచ్ రోడ్డులో కేటాయించారు. సీఎం చంద్రబాబు దీనిపై సమీక్షించినప్పుడు 2025లో న్యూఇయర్ బహుమతిగా అందిస్తామని వీఎంఆర్‌డీఏ అధికారులు చెప్పారు. అనుకున్నట్టుగానే సంక్రాంతికి సిద్ధం చేశారు. అప్పటి నుంచి ప్రారంభోత్సవానికి ఎదురు చూస్తోంది.

ముంతాజ్‌లో నిల్వ ఆహారం

... 5వ పేజీ తరువాయి

అందిస్తున్నారు. అటువంటి ఆహారాన్ని తినడం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలు, కేన్సర్ వంటి వ్యాధుల బారినపడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాబట్టి, వీలైనంత వరకు ఇంట్లో వండిన ఆహార పదార్థాలకు ప్రాధాన్యం ఇవ్వాలంటున్నారు. ఈ మధ్య కాలంలో తనిఖీలు చేస్తున్న అనేక హోటళ్లలో ఇదే విధమైన ఆహార పదార్థాలను గుర్తిస్తున్నామని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ జీవీ అప్పారావు వివరించారు.

సమస్యలు పరిష్కరించాలి

- మేయర్, జీవీఎంసీ కమిషనర్‌కు వినతి

వెంకోజీపాలెం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ మేయర్ పీలా శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గర్గ్‌లకు యూనియన్ నేతలు సోమవారం వినతులిచ్చారు.కార్మికులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, అప్కోస్ కార్మికుల సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవ్‌లతో పాటు 6 దఫాలుగా ఇవ్వాల్సిన డీఏ బకాయిలు, మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు పెన్షన్, గ్రాట్యుటీ వంటివి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్, నీటి సరఫరా, యూజీడీ కార్మికులకు జీతాలు పెంచాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. అన్ని జోన్లలోనూ మౌలిక సదుపాయాల కల్పన, వాహన సామర్థ్యం మెరుగుపరచాలని కోరారు. వినతిపత్రాలు అందజేసిన వారిలో జీవీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) అధ్యక్షులు పడాల రమణ, నాయకులు, కె.సత్యనారాయణ, నూకరాజు, ప్రసాద్, శేఖర్, దేముడు బాబు, పిట్టా రమణ తదితరులు ఉన్నారు.

'సుపరిపాలనే కూటమి ధ్యేయం'

మద్దిలపాలెం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బొట్టా వెంకటరమణ చెప్పారు. పాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా 22వ వార్డు పీతాపురంకాలనీలో సోమవారం టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాల అమలుతో ప్రజలకు సంక్షేమం అందించారన్నారు. సమస్యల పరిష్కారం కోసం తమను సంప్రదించాలని కోరారు. అనంతరం స్థానికులకు ప్రభుత్వం ఏడాదిలో అమలు చేసిన పథకాలు, భవిష్యత్‌లో చేయబోయే కార్యక్రమాలను వివరించారు. టీడీపీ నాయకులు ఒమ్మి అప్పారావు, డొక్కరి శ్రీను, కోడిబోయిన ఆనంద్, దువ్వి రాజ్‌కుమార్, నాగూర్, డేవిడ్, గుణవతి పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు అడ్డాగా ఏపీ

- వైసీపీ నేత కేకే రాజు

మద్దిలపాలెం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు నగరాల్లో మాదకద్రవ్యాల కేసులను నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసేలా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె. రాజు కోరారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి మాదకద్రవ్యాల వినియోగం పెరిగిందన్నారు. ఇటీవల పలు నగరాల్లో వెలుగుచూస్తున్న డ్రగ్స్ కేసులే ఇందుకు నిదర్శనమన్నారు. నగరంలోని ఏయూలో 25 గ్రాముల కొకైన్ పట్టుకున్నామని పోలీసులే వెల్లడించారన్నారు. ఈ కేసులో అధికార పార్టీకి చెందిన వ్యక్తులను తప్పించే ప్రయత్నం చేస్తున్నారని తమ దృష్టికి వచ్చినట్టు తెలిపారు. నాడు వైసీపీ ప్రభుత్వంపై డ్రగ్స్ పేరుతో బురదచల్లారని, ఇప్పుడు ఏపీ డ్రగ్స్‌కు అడ్డాగా మారిపోతే ఏం చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు.

సినిమా గైడ్

- **తమ్ముడు** : మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)
- **జురాసిక్ వరల్డ్** : జగదాంబ, రమాదేవి
- **కన్నప్ప** : జగదాంబ, కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి). లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ),
- **కుబేర** : సంగం, ఊర్వశి (కంచరపాలెం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఎఫ్.1** : రమాదేవి, జగదాంబ,
- **మార్గన్ :** శారద, శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 30, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 40, పచ్చిమిర్చి 58, కాకరకాయలు 36, బీరకాయలు 40, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 20, క్యారెట్ 44, దొండకాయలు 44, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది)50, బరబాటి 38, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 45, బద్దచిక్కుడు 50, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 90, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 110, కీరదోస 34, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 34, చిలగడదుంపలు 36, కంద 64, దేముడు చిక్కుడు 78, గోరు చిక్కుడు 44, కూర పెండలం 30, బ్రకోలీ 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	560
విజయనగరం	564
శ్రీకాకుళం	564

రైతు ధర	78
లైవ్ ధర	98
విత్ స్కిన్	166
స్కిన్‌లెస్	176



వెంకోజీపాలెం వద్ద ఏర్పాటు చేసిన బయో టాయిలెట్లు



బీఆర్‌టీఎస్ రోడ్డులో తుప్పలను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

గిరి ప్రదక్షిణకు ముమ్మరంగా ఏర్పాట్లు

- జీవీఎంసీ ఆధ్వర్యంలో శరవేగంగా ఏర్పాట్లు
- కూడళ్లు సుందరంగా ముస్తాబు
- రోడ్లకి ఇరువైపులా తుప్పల తొలగింపు
- పలుచోట్ల తాత్కాలిక టాయిలెట్లు

వెంకోజీపాలెం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : అప్పన్న గిరి ప్రదక్షిణకు వచ్చే భక్తులకు జీవీఎంసీ విస్తృత సదుపాయాలు కల్పిస్తోంది. ఎంవీపీ కాలనీలోని అప్పుఘర్ వద్ద బీచ్‌లో స్నానాలు ఆచరించి వచ్చిన మహిళలు దుస్తులు మార్చుకునేందుకు సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు. కొత్తవెంకోజీపాలెం నుంచి హెచ్‌బీకాలనీ మీదుగా సీతమ్మధార వైపు వెళ్లే భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కొత్తవెంకోజీపాలెం వద్ద బయోటాయిలెట్లు అమర్చారు. స్వచ్ఛంద సంస్థలు, రోడ్డు పక్కన ఆలయాల నిర్వాహకులు భక్తులకు ప్రసాదం, మంచినీరు, అల్పాహారం, మందులు పంపిణీ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇక్కడి సాయినాథుని ఆలయాల వద్ద గురుపౌర్ణమి రోజున విశేష పూజలు నిర్వహించి, అన్నసమారాధన నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మార్గాన వెళ్లే భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా శానిటరీ ఇన్‌స్పెక్టర్లు కిషోర్, సూరిబాబు, శుభ్రం మేస్త్రీలు రమణ, నమ్మి చిన్నరాజు, జి.బాబులు, శ్రీను, ఇతర సిబ్బంది ఈ మార్గాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఏఎంఓహెచ్ ప్రసాద్ పర్యవేక్షిస్తున్నారు. ఈ మార్గంలో గోతులు పూడ్చటం, విద్యుత్ దీపాల మరమ్మతు, ఫుట్‌పాత్‌లు ఖాళీ చేయించడం, గుబురుగా ఉండే చెట్టుకొమ్మలను సరిచేయడం, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, రోడ్డుపైన వాహనాలు ఉంచకుండా సిబ్బంది ప్రత్యేక చర్యలను మూడు రోజులుగా చేపడుతున్నారు.

బీఆర్‌టీఎస్ రోడ్డులో తుప్పల తొలగింపు

ఆరిలోవ : గిరి ప్రదర్శనలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా రోడ్లు, చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలను జీవీఎంసీ సిబ్బంది తొలగిస్తున్నారు. ముడసర్లోవ రిజర్వాయర్‌కి సమీపంలోని రోడ్డు డివైడర్‌ల మధ్య సుందరీకరణకు వేసిన పూల మొక్కల చుట్టూ పెరిగిపోయిన కలుపు మొక్కలను తొలగిస్తున్నారు. ఫుట్‌పాత్‌లపై మార్గాన్ని అనుకూలంగా మార్చుతున్నారు.

వీధి దీపాల మరమ్మతు

హనుమంతవాక జంక్షన్ నుంచి కేంద్ర కారగారం వరకూ వీధి లైట్లకు మరమ్మతులు చేపడుతున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వీధి దీపాల మరమ్మతుకు చర్యలు చేపట్టారు. కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్, సీపీ ఆదేశాలతో కదిలిన సిబ్బంది సత్వరమే పనులు చేపడుతున్నారు.

10న మెగా పేరెంట్స్ సమావేశం



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఆర్జేడీ ఆదినారాయణ

మద్దిలపాలెం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ వీఎస్ కృష్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 10న నిర్వహించనున్న మెగా పేరెంట్, టీచర్ సమావేశం ఏర్పాట్లను సోమవారం ఇంటర్మీడియట్ బోర్డు ఆర్జేడీ ఆదినారాయణ పరిశీలించారు. ఈ సమావేశానికి హాజరుకావాలని ఆహ్వాన పత్రికలను విద్యార్థులకు అందించి వాటిని తల్లిదండ్రులకు ఇవ్వాలని సూచించారు. సమావేశానికి వచ్చే విద్యార్థుల తల్లిదండ్రులకు సదుపాయాలు కల్పించాలని కళాశాల అధ్యాపకులను ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పథకంలో భోజనాన్ని పరిశీలించి విద్యార్థులకు వడ్డించారు.

వసతి గృహంలో ప్రవేశానికి దరఖాస్తులు

ఆరిలోవ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఇందిరానగర్‌లోని ఆనంద మార్గ్ చిల్డ్రన్ హోంలో పేదలు, అనాథలకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు హోం నిర్వాహకులు తెలిపారు. ఆరు నుంచి పదేళ్లలోపు వయస్సుగల వారు ఇందులో చేరవచ్చని, వారికి ఉచితంగా విద్య, వసతి, భోజనం సమకూరుస్తామని హోం ఇన్‌చార్జి సౌమ్యానంద అవధూత తెలిపారు. విశాఖ, ఇతర జిల్లాల పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

33 మద్యం సీసాలు స్వాధీనం

ఎంవీపీ కాలనీ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎంవీపీ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెదవాల్తేరు గాంధీ విగ్రహం సమీపంలోని ఓ దుకాణంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న వారిపై ఎంవీపీ పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడి చేసి 33 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు.. సోమవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ ఎం.భరత్, ఎంవీపీ ఎస్‌ఐ శ్రీనివాస్ తమ సిబ్బందితో ఆ ప్రాంతానికి వెళ్లినప్పుడు అక్కడ ఓ వ్యక్తి రెండు సంచులతో మద్యం సీసాలు తీసుకెళ్తున్నాడు. పోలీసులను చూసి పరారవడానికి ప్రయత్నించడంతో అతడిని పట్టుకున్నారు. పెదవాల్తేరు, ఫిష్ మార్కెట్ ప్రాంతానికి చెందిన బోర సతీష్ (39)గా గుర్తించి, అబ్కారీ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి, అరెస్టు చేశారు. సీఐ మురళి పర్యవేక్షిస్తున్నారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం పెదబోడెపల్లి, ఎస్సీ కాలనీకి చెందిన బాలిక అదృశ్యమైనట్లు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. బాలిక (17) నగరంలోని బోయపాలెంలోని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. అనారోగ్యం కారణంగా గత నెల 30న ఉషోదయ కూడలిలో ఉంటున్న తన పిన్ని ఇంటికి వచ్చింది. ఈనెల 4న రాత్రి 8.30 గంటల సమయంలో ఆమె బయటకు వెళ్లి, తిరిగి రాలేదు. అన్ని చోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలిక తనతో పాటు ద్విచక్ర వాహనం కూడా తీసుకువెళ్లింది. ఏఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యలో నాణ్యత పెంపునకు కృషి చేయాలి

వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్



మాట్లాడుతున్న వీసీ రాజశేఖర్

వెంకోజీపాలెం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : విద్యలో నాణ్యత మరింత పెంపొందించే దిశగా అనుబంధ కళాశాలలు, విశ్వవిద్యాలయంతో కలిసి ముందుకు సాగాలని ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ సూచించారు.సోమవారం కన్వెన్షన్ సెంటర్‌లో ఏయూ అనుబంధ కళాశాలల కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్‌తో నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. పరీక్షల నిర్వహణ సక్రమంగా, పటిష్ఠంగా జరగాలని స్పష్టం చేశారు. తాను గుర్తించిన కొన్ని లోపాలకు పరిష్కారాలు చూపిస్తున్నట్టు చెప్పారు. పరీక్షల నిర్వహణలో అలసత్వం, నిర్లక్ష్యం కనిపిస్తే పరీక్షా కేంద్రాన్ని, కళాశాల గుర్తింపును రద్దు చేయడానికి వెనుకాడబోమని స్పష్టం చేశారు. బీఈడీ, న్యాయ కళాశాలల పనితీరు మరింత మెరుగుపడాలని సూచించారు. అనుబంధ కళాశాలలను భాగస్వాములను చేస్తూ త్వరలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలు ప్రారంభిస్తామని వీసీ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో ఏయూ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తూ 100 ఫ్యాకల్టీ, 10 వేల మంది విద్యార్థులను ఏఐ, డీప్ లెర్నింగ్ రంగాలలో నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు.రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్. ధనుంజయరావు, కళాశాల డెవలప్‌మెంట్ కౌన్సిల్ (సీడీసీ) డీన్ ఆచార్య టి. వెంకటకృష్ణ, యూజీ పరీక్షలు డీన్ ఆచార్య నానాజీరావు, అనుబంధ కళాశాలల అసోసియేషన్ కార్యదర్శి రమణాజీలు మాట్లాడారు.అసోసియేషన్ అధ్యక్షుడు పైడా కృష్ణప్రసాద్, గౌరవ అధ్యక్షుడు బలరామకృష్ణ, గాయత్రివిద్యా పరిషత్ కార్యదర్శి ఆచార్య పి.సోమరాజు తదితరులు పలు సూచనలు చేశారు. డీన్లు ఆచార్య కె.రమాసుధ, కె. శ్రీనివాసరావు, కె. రాంబాబు, బి.మునిస్వామి, ఎస్.హరినాథ్, పి.శ్యామల, డి.ఎ.నాయుడు తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛ రథాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

స్వచ్ఛతా పక్షోత్సవాలు ప్రారంభం

సిరిపురం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : నగర ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ పర్యావరణ పరిరక్షణకు సహకరించానలి జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ కోరారు. సోమవారం ఆయన హెచ్‌పీసీఎల్ విశాఖ రిఫైనరీ, జీవీఎంసీతో కలిసి సంయుక్తంగా నిర్వహిస్తున్న స్వచ్ఛతా పక్షోత్సవాలను హెచ్‌పీసీఎల్ విశాఖ రిఫైనరీ ప్రధాన కార్యాలయం వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ ధ్యేయంగా స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర గమ్యంగా ముందుకెళ్లాలన్నారు. ఈనెల 1 నుంచి 15వ తేదీ వరకు నిర్వహిస్తున్న స్వచ్ఛతా పక్వాడ కార్యక్రమాలు అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ నరేష్‌కుమార్, హెచ్‌పీసీఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమేష్ కృష్ణన్, సీజీఎం హెచ్‌ఆర్ గంటా కిరణ్‌కుమార్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

నగరంలో పారిశుధ్య పనులను రాత్రి పూట మరింత మెరుగుపరచాలని ప్రజారోగ్య అధికారులను కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. వినాయక టెంపుల్ రోడ్డులో సోమవారం రాత్రి జరిగిన పారిశుధ్య పనులను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా రాత్రి పూట పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులు, వ్యర్థాలు తరలించే వాహన డ్రైవర్లు, లోడర్లతో మాట్లాడి వారి పనితీరు, విధుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నగర పరిశుభ్రతకు కృషి చేయాలని చెప్పారు. ఆయనతో పాటు ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్ ఉన్నారు.

రాజు వేగేశ్న ఫౌండేషన్ డైరెక్టర్ ఆనందరాజు కన్నుమూత



విశాఖపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టిన రాజు వేగేశ్న ఫౌండేషన్ డైరెక్టర్ వేగేశ్న ఆనందరాజు (67) ఆదివారం ఉదయం నగరంలోని కిమ్స్ ఆస్పత్రిలో కన్నుమూశారు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన వెల్లూరు సీఎంసీలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం ఉదయమే అక్కడ నుంచి విశాఖ తీసుకువచ్చారు. కొద్దిసేపటికే పరిస్థితి విషమించడంతో కిమ్స్‌లో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. తిథి, నక్షత్రం ప్రకారం ఆనందరాజు 1958లో తొలి ఏకాదశి రోజున జన్మించారు. అదేరోజు కన్నుమూశారు. ఆయనకు భార్య అనంతలక్ష్మి సత్యవతి, కుమారుడు రఘురామరాజు, కుమార్తె రాధిక ఉన్నారు.పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం సమీపాన గల గణపవరంలో జన్మించిన ఆనందరాజు వ్యాపారరీత్యా 1979లో విశాఖ వచ్చారు. వేగేశ్న ఫౌండేషన్ ద్వారా రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఆస్పత్రులు, పాఠశాలలు, బస్టాండ్లలో వాటర్‌ప్లాంట్లు ఏర్పాటు చేశారు. తిరుమలలో రూ.77 కోట్లతో అన్నదానసత్రం,రూ.27 కోట్లతో వాటర్‌ప్లాంట్ నిర్మించడంతోపాటు వాటి నిర్వహణకు ఏటా రూ.1.5 కోట్లు అందజేస్తున్నారు. ద్వారకా తిరుమలలో రూ.30 కోట్లతో ఆస్పత్రిని నిర్మించారు. షిర్డీలో రూ.ఆరు కోట్లు, యాదగిరిగుట్టలో రూ.20 కోట్లతో వాటర్ ప్లాంట్లు నిర్మించారు.

సీఎం సంతాపం

ఆనందరాజు మృతికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ సంతాపం తెలిపారు. ఫౌండేషన్ ద్వారా తెలుగు రాష్ట్రాల్లో ఆస్పత్రులు, ఆలయాలు, పాఠశాలల్లో పలు సౌకర్యాలు కల్పించారని పేర్కొన్నారు. స్వచ్ఛంద సేవా కార్యక్రమాలతో ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకున్న ఆనందరాజు సేవలు చిరస్మరణీయమని తెలిపారు.

అంకితభావంతో పని చేస్తే గుర్తింపు



రామకృష్ణను సన్మానిస్తున్న సిబ్బంది

విశాఖపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : పెదవాల్తేరులోని ప్రాంతీయ ప్రజారోగ్య ప్రయోగశాలలో సీనియర్ అనలిస్ట్‌గా పనిచేసి బదిలీపై విజయవాడకు వెళ్లిన వై. శివరామకృష్ణను కార్యాలయం సిబ్బంది సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన వ్యక్తి శివరామకృష్ణ అన్నారు. అనంతరం శివరామకృష్ణ మాట్లాడుతూ సిబ్బంది సహకారం వల్లే ఐదేళ్లకు పైగా మంచి వాతావరణంలో పనిచేయగలిగానని చెప్పారు. కార్యక్రమంలో జూనియర్ సైంటిఫిక్ ఆఫీసర్ శ్రీనివాసులు, జూనియర్ అనలిస్టులు మాధవరావు, గౌరీశ్వరరావు, శ్రీనివాసరావు, సిబ్బంది సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అప్పన్న హుండీ ఆదాయం రూ.1.54 కోట్లు

సింహాచలం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకల ద్వారా స్వామి వారి ఖజానాకు సుమారు రూ.1.54 కోట్ల ఆదాయం సమకూరింది. సోమవారం సింహగిరిపై పరకామణి కేంద్రంలో దేవస్థానం ఈఓ త్రినాథరావు సారథ్యంలో ఆలయ సిబ్బంది హుండీల లెక్కింపు చేపట్టారు. గత 21 రోజులకు గాను రూ. 1,54,80,798 నగదు రూపంలో లభించగా, 132.1 గ్రాముల స్వర్ణం, 9.835 కిలోల రజితం ఆభరణాల రూపంలో భక్తులు సమర్పించారు. అలాగే 230 యూఎస్‌ఏ డాలర్లు, 25 యూఏఈ దీరమ్స్, 60 సౌదీ అరేబియా రియల్స్, 60 సింగపూర్ డాలర్లు, మలేషియా, నేపాల్, కువాయిట్, ఒమన్, తదితర దేశాలకు చెందిన కరెన్సీ కూడా లభించింది.

జాతీయ రహదారి పక్కన గోతుల పూడ్చివేత

ఆరిలోవ, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారికి రెండువైపులా ఏర్పడిన గోతుల పూడ్చివేతకు అధికారులు చర్యలు తీసుకున్నారు. రోడ్డు అంచు కోతకు గురవడంతో రహదారికి, పక్కనున్న చోటుకు మధ్య గోతులు ఏర్పడ్డాయి. దీంతో జాతీయ రహదారిపై ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ విషయమై పత్రికల్లో పలుమార్లు కథనాలు రావడంతో సంబంధిత అధికారులు స్పందించారు. రహదారి పక్కనున్న గోతులను పూడ్చివేతకు చర్యలు చేపట్టారు. దీంతో వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు జోన్-2లో తాగునీటి సరఫరా నిలిపివేత

వెంకోజీపాలెం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ జోన్ 2 పరిధిలోని పలు వార్డులకు మంగళవారం తాగునీటి సరఫరా నిలిపివేసినట్టు మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజనీరు సుధాకర్ తెలిపారు. సోమవారం వారు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గోస్తనీ హెడ్ వాటర్ వర్క్స్ నుంచి తాగునీటిని పంపింగ్ చేసే ప్రధాన పైప్‌లైన్ మారికవలస వద్ద లీకేజీ కావడంతో మరమ్మతులు చేపడుతున్నామన్నారు. ఈమేరకు వార్డు 5లోని బోయపాలెం హౌసింగ్ కాలనీ, పరదేశిపాలెం, బోరవానిపాలెం, సాయిరాం కాలనీ, మారికవలస ఆర్‌జీకే, వైఎస్సార్ కాలనీ, శారదానగర్, శివశక్తినగర్, కొమ్మాది ప్రాంతాలకు, ఆరో వార్డులో కొమ్మాది, బక్కన్నపాలెం, రేవళ్లపాలెం, రిక్షా కాలనీ, వైభవనగర్, పీఎంపాలెం, కే1, కే2, కే3, ఎం1 హౌసింగ్ కాలనీ, ఏడో వార్డులో వాంబేకాలనీ, చంద్రంపాలెం, కళానగర్, కృష్ణనగర్, ఎన్‌జీఓఎస్ కాలనీ, స్వతంత్రనగర్, గణేశ్‌నగర్, మిథిలాపూరి వుడా కాలనీ, ఓల్డ్ మధురవాడ, పిలకవానిపాలెం ప్రాంతాలకు నీటి సరఫరా ఉండదన్నారు. 8వ వార్డులో రెవెన్యూ లేఅవుట్, షిప్‌యార్డు కాలనీ, బింద్రానగర్ ప్రాంతాలకు కూడా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. అత్యవసరమైన ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తామని వెల్లడించారు.

రిసోర్స్ పర్సన్లకు ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబ్‌లను అందజేస్తున్న మేయర్ శ్రీనివాసరావు, కమిషనర్ కేతన్ గార్గ్

వెంకోజీపాలెం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరవేయాలన్న ఉద్దేశంతో రిసోర్స్ పర్సన్లకు ట్యాబ్‌లు సమకూర్చినట్లు మేయర్ పీలా శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన కమిషనర్ కేతన్ గార్గ్‌తో కలిసి 50 మందికి ట్యాబ్‌లను అందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో రిసోర్స్‌పర్సన్లు, స్వయంశక్తి సంఘాల ద్వారా అన్ని ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతమవుతున్నాయని తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ మెప్మా, జీవీఎంసీ సంయుక్తంగా 1191 ట్యాబ్‌లను రూ.3.93 కోట్లతో కొనుగోలు చేసినట్లు తెలిపారు. మెప్మా ద్వారా వచ్చే అన్ని పథకాలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేసి అర్హులకు సేవలందించాలన్నారు. ఉత్తమ పనితీరు కనబరిచిన యూసీడీ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యవేణిని మేయర్, కమిషనర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఏపీడీలు, సీఓలు, డీఎంసీ, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో ముందుండాలి

దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాద్



విజేతలను అభినందిస్తున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

మద్దిలపాలెం, జూలై7(ఆంధ్రజ్యోతి) : యువత అన్ని రంగాల్లో ముందుండి ఉన్నత భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ హితవు పలికారు. శివాజీపాలెంలోని క్యాంపు కార్యాలయంలో సోమవారం రేడియో సిటీ కుక్ సీజన్-2 విజేత రవితేజను ఆయన అభినందించి మాట్లాడారు. ఈ సీజన్‌లో 350 మంది పాల్గొనగా సదరన్ ఇనిస్టిట్యూట్ విద్యార్థి రవితేజ విజేతగా నిలవడం గొప్ప విషయమన్నారు. మరిన్ని విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇనిస్టిట్యూట్ అధినేత సతీష్ పొన్నం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కనకమ్మ తొలేళ్లు



అమ్మవారికి తీసుకువెళుతున్న సారె

వెంకోజీపాలెం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఇసుకతోట జాతీయ రహదారి పక్కనున్న కనకదుర్గ అమ్మవారి జాతర మహోత్సవంలో భాగంగా సోమవారం తొలేళ్లు కన్నుల పండువగా జరిగింది. సీతారామ సేవా మం డలి సభ్యుల పర్యవేక్షణలో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. తెల్లవారు జాము నుంచి మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్, గాజులు సమర్పించారు. సాయంత్రం శతకంపట్టు నుంచి అమ్మవారికి సారెను ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కోరిబిల్లి త్రినాథ్ శివ సత్యబాబు, ఉపాధ్యక్షుడు మద్ది శశిభూషణరెడ్డి, కార్యదర్శి సూరిశెట్టి అప్పలరాజు (బుజ్జి), ఇతర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలని ఆటో జాతా

ఆరిలోవ, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 9న నిర్వహించనున్న అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ పాత డెయిరీఫారం కూడలిలో సోమవారం ఉదయం ఆటో డ్రైవర్లు ప్రచార జాతా నిర్వహించారు. జోన్ కార్యదర్శి పి.వెంకటరావు ఈ జాతాను ప్రారంభించారు. నరేంద్రమోదీ ప్రభుత్వం తీసుకు వచ్చిన 4 లేబర్ కోడ్స్‌ను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కొనసాగించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాడాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సీఐటీయూ మద్దిలపాలెం జోన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వి.నరేంద్ర కుమార్ మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు అమలు చేయాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, తొలగించిన కాంట్రాక్టు కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వి.తులసీరాం, సీఐటీయూ నాయకుడు డి. నాగరాజు, పెన్షన్‌దారుల సంఘం నాయకుడు భూలోకరావు పాల్గొన్నారు.

ఎంవీపీ స్టేషన్‌లో సిబ్బంది చేతివాటం

ఎంవీపీ కాలనీ, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో ఇద్దరి చేతివాటం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై ఉన్నతాధికారులు వివరాలు సేకరిస్తున్నారు. సుమారు రెండు నెలల కిందట జరిగిన ఈ సంఘటనకు సంబంధించి.. ఎంవీపీ పోలీస్ స్టేషన్ నేర విభాగం పరిధిలో వివిధ కేసుల్లో కొన్ని ద్విచక్ర వాహనాలు నెలల తరబడి ఉండిపోయాయి. వీటిని సాధారణంగా వేలం వేస్తుంటారు. అయితే నెలల తరబడి ఉండిపోవడం వల్ల అవి చాలా వరకూ పాడైపోయాయి. ఇలాంటి వాటిని అధికారికంగానే స్క్రాప్‌కు ఇస్తుంటారు. అయితే ఇదేమీ జరగక ముందే శాంతిభద్రతల విభాగంలోని ఓ హోం గార్డు (ప్రస్తుతం వేరే స్టేషన్‌లో విధుల్లో ఉన్నారు), ఓ హెడ్ కానిస్టేబుల్ (ఆగస్టులో ఉద్యోగ విరమణ చేయనున్నారు) ఇద్దరూ కలసి 17 ద్విచక్ర వాహనాలను ఓ స్క్రాప్ నిర్వాహకుడికి ఇచ్చేశారు. విషయం ఇతర సిబ్బందికి తెలియడంతో అవి నేరం జరిగిన సంఘటనల్లో సొత్తు అని, అలా తీసుకువెళ్లడం ఇబ్బంది అవుతుందని చెప్పడంతో, తిరిగి వాటిని తీసుకువచ్చి, పోలీసులు సాధారణంగా వాహనాలు నిలిపే డంపింగ్ యార్డు వద్దకు తరలించారు. ఇదంతా బయటకు తెలియకపోవడంతో సమస్యేమీ లేదని ఊపిరి పీల్చుకున్నారు. ఎలాగో ఈ సమాచారం ఉన్నతాధికారుల దృష్టికి చేరింది. దీంతో ఇక్కడి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసి, దీనిపై వివరాలు పంపించాలని స్టేషన్ అధికారులను ఆదేశించారు. ఏమీ జరగలేదన్నట్లు విషయాన్ని తేల్చి చెప్పడానికి ప్రయత్నిస్తున్నా, ఎటు నుంచి ఎటు వెళ్తుందో అనే ఆందోళన సిబ్బందిలో వ్యక్తమవుతోంది.

గిరి ప్రదక్షిణకు అరకొర పనులు


వీధి లైట్లు వెలుగుతున్నా చీకట్లే.


రోడ్డు పక్కన మార్జిన్లలో చిన్నరాళ్లను సిమెంట్‌తో కలిపి వేసి చదును చేయని దృశ్యం.

విశాఖపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సింహగిరి ప్రదక్షిణ ఏర్పాట్లు అరకొరగానే సాగుతున్నాయి. ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేసిన ప్రాంతాల్లో కూడా పూర్తిస్థాయి పనులు చేపట్టడం లేదు. విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే తన ప్రాంతంలో పోర్టు సేడియం వెనక రోడ్డు నుంచి మాధవధారకు చిమ్మచీకటిగా ఉంటుందని, సరైన విద్యుద్దీపాలు పెట్టించాలని కోరారు. అయితే అధికారులు కొ

ఎమ్మెల్యే ఫిర్యాదు చేసినా అదే నిర్లక్ష్యం

న్నిచోట్ల మాత్రమే హైమాస్ట్ దీపాలను తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. ఈ నెల 9న అంటే బుధవారం గిరి ప్రదక్షిణ ప్రారంభం కానుండగా సోమవారం రాత్రి వరకు పోర్టు స్టేడియం వెనుక నుంచి కైలాసపురం వరకూ పైకి ఉన్న సాధారణ వీధి లైట్లు తప్పితే అదనంగా విద్యుదీపాలు పెట్టలేదు. ఇకపోతే రోడ్డు మార్జిన్లు బురదగా, చిత్తడిగా ఉండగా, వాటిపై సిమెంట్, రాళ్లతో కలిపిన మెటీరియల్ వేసి వదిలేశారు. కనీసం వాటిని చదును కూడా చేయలేదు. కాంట్రాక్టర్లకు పనులు అప్పగించి వారు ఎలా చేశారో అధికారులు పర్యవేక్షించడం లేదు. గడువు సమీపించిన నేపథ్యంలో భక్తులు ఇబ్బంది పడకుండా ఈ నిర్లక్ష్యంపై తక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంది.

అప్పన్న హుండీల ఆదాయం రూ.1.54 కోట్లు


హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

సింహాచలం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామికి భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకల ద్వారా స్వామివారి ఖజానాకు సుమారు రూ.1.54 కోట్ల ఆదాయం సమకూరింది. సోమవారం సింహగిరిపై పరకామణి కేంద్రంలో దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు సారధ్యంలో ఆలయ సిబ్బంది హుండీల లెక్కింపు చేపట్టారు. గత 21 రోజులకు గాను రూ.1,54,80,798 నగదు రూపంలో లభించగా, 132.1 గ్రాముల స్వర్ణం, 9.835 కిలోల రజితం ఆభరణాల రూపంలో భక్తులు సమర్పించారు. అలాగే 230 యూఎస్‌ఏ డాలర్లు, 25 యూఏఈ దీరమ్స్, 60 సౌదీ అరేబియా రియల్స్, 60 సింగపూర్ డాలర్లు, మలేషియా, నేపాల్, కువాయిట్, ఒమన్, తదితర దేశాలకు చెందిన కరెన్సీ కూడా లభించింది.

ఉక్కు టౌన్‌షిప్‌లో దొంగల స్వైరవిహారం

సెక్టార్-6లోని మూడు క్వార్టర్లలో ప్రవేశించి బంగారం, వెండి, నగదు అపహరణ

ఉక్కుటౌన్‌షిప్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంటు టౌన్‌షిప్‌లో దొంగలు హల్‌చల్ చేశారు. మూడు క్వార్టర్లలో ప్రవేశించి నగదు, బంగారం, వెండి ఎత్తుకుపోయారు స్టీల్ ప్లాంటు క్రైమ్ పోలీసులు సోమవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సెక్టార్-6లోని 335-డీ క్వార్టర్‌లో ఉంటున్న ఎస్ఎంఎస్-2 విభాగం సీనియర్ టెక్నీషియన్ సీహెచ్‌ఈ రాజ్‌కుమార్ ఈ నెల ఐదో తేదీన కుటుంబంతో కలిసి అత్తవారింటికి వెళ్లారు. సోమవారం పొరుగునున్న సత్యనారాయణ ఆయనకు ఫోన్ చేసి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని సమాచారం అందించారు. దీంతో వారు వచ్చి చూడగా..ఇంట్లో ఉంచిన 3 తులాల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదు, 70 తులాల వెండి సామగ్రి చోరీకి గురైనట్టు గురించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే సెక్టార్‌లోని 327-డి క్వార్టర్‌లో నివసిస్తున్న పి.రాధాకృష్ణ సెక్టార్-6 కాంప్లెక్స్‌లో టిఫిన్ షాపు నడుపుతున్నారు. ఆదివారం రాత్రి ఆయన తమ ఇంటి వద్ద బైకు పార్కింగ్ చేశారు. సోమవారం ఉదయం తన బైకు కనిపించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. అలాగే మరో క్వార్టర్‌లో ఓ ప్లాంట్ ఉద్యోగి ఉంటున్నారు. ఆయన లేని సమయంలో ఇంట్లో దొంగలు ప్రవేశించి 45 గ్రాముల బంగారం, లక్ష నగదు చోరీ చేసినట్టు తెలిసింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందాల్సి ఉంది. కాగా మరో క్వార్టర్‌లో నివసిస్తున్న ఎస్ఐ ఇంటి తలుపులు విరగ్గొట్టి లోపలకు వెళ్లిన దొంగలు...లోపల పోలీసు దుస్తులు చూసి అక్కడ నుంచి పరారైనట్టు తెలిసింది. క్రైమ్ సీఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజు వేగేశ్న ఫౌండేషన్ డైరెక్టర్ ఆనందరాజు కన్నుమూత


ఆనందరాజు (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టిన రాజు వేగేశ్న ఫౌండేషన్ డైరెక్టర్ వేగేశ్న ఆనందరాజు (67) ఆదివారం ఉదయం నగరంలోని కిమ్స్ ఆస్పత్రిలో కన్నుమూశారు. కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆనందరాజు వెల్లూరు సీఎంసీలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం ఉదయమే అక్కడ నుంచి విశాఖ తీసుకువచ్చారు. కొద్దిసేపటికే పరిస్థితి విషమించడంతో కిమ్స్‌లో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. తిథి, నక్షత్రం ప్రకారం ఆనందరాజు 1958 సంవత్సరంలో తొలి ఏకాదశి రోజున జన్మించారు. అదేరోజు కన్నుమూశారు. ఆయనకు భార్య అనంతలక్ష్మి సత్యవతి, కుమారుడు రఘురామరాజు, కుమార్తె రాధికా ఉన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం సమీపాన గల గణపవరంలో జన్మించిన ఆనందరాజు వ్యాపారరీత్యా 1979లో విశాఖపట్నం వచ్చారు. వేగేశ్న ఫౌండేషన్ ద్వారా రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో ఆస్పత్రులు, పాఠశాలలు, బస్టాండ్‌లలో వాటర్‌ప్లాంట్లు ఏర్పాటుచేశారు. తిరుమలలో రూ.77 కోట్లతో అన్నదాన సత్రం, రూ.27 కోట్లతో వాటర్‌ప్లాంట్ నిర్మించి వాటి నిర్వహణకు ఏటా రూ.1.5 కోట్లు అందజేస్తున్నారు. ద్వారకా తిరుమలలో రూ.30 కోట్లతో ఆస్పత్రి నిర్మించారు. షిర్డీలో రూ.ఆరు కోట్లు, యాదగిరిగుట్టలో రూ.20 కోట్లతో వాటర్‌ప్లాంట్లు నిర్మించారు.

సీఎం సంతాపం

ఆనందరాజు మృతికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్‌లు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు. ఫౌండేషన్ ద్వారా తెలుగు రాష్ట్రాల్లో ఆస్పత్రులు, ఆలయాలు, పాఠశాలల్లో పలు సౌకర్యాలు కల్పించారని పేర్కొన్నారు. స్వచ్ఛంద సేవా కార్యక్రమాలతో ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకున్న ఆనందరాజు సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు.

11న పలు రైళ్లు రద్దు

విశాఖపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు డివిజన్ పరిధిలోని కోటబొమ్మాళి స్టేషన్ వద్ద ఇంటర్ లాకింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈ నెల 11న పలు రైళ్లను రద్దు చేశామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ-గుణుపూర్ పాసింజర్ (58506), గుణుపూర్-విశాఖ పాసింజర్ (58505), విశాఖ-బ్రహ్మపూర్ పాసింజర్ (58532), బ్రహ్మపూర్-విశాఖ పాసింజర్ (58531), భువనేశ్వర్-విశాఖ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ (22819), విశాఖ-భువనేశ్వర్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ (22820), విశాఖ-పలాస పాసింజర్ (67289), పలాస-విశాఖ పాసింజర్ (67290), విశాఖ-బ్రహ్మపూర్ ఎక్స్‌ప్రెస్ (18526), బ్రహ్మపూర్-విశాఖ ఎక్స్‌ప్రెస్ (18525)లు రద్దయినవాటిలో ఉన్నాయని పేర్కొన్నారు.

ప్రత్యేక రైళ్లు: సంత్రాగచ్చి-యశ్వంత్‌పూర్, షాలిమార్-చెన్నై మధ్య ప్రత్యేక రైలు సర్వీసులు ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 02863 నంబరు గల సంత్రాగచ్చి-యశ్వంత్‌పూర్-సంత్రాగచ్చి రైలు ఈ నెల 10 నుంచి ఆగస్టు 28 వరకు గురువారం మధ్యాహ్నం 12.50 గంటలకు సంత్రాగచ్చిలో బయలుదేరి మరుసటి రోజు వేకువజాము 2.43 గంటలకు దువ్వాడ, శనివారం వేకువజాము 00.55 గంటలకు (శుక్రవారం అర్ధరాత్రి 12.55) యశ్వంత్‌పూర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 02864 నంబరు గల రైలు ఈ నెల 12 నుంచి ఆగస్టు 30 వరకు ప్రతి శనివారం ఉదయం 4.30 గంటలకు యశ్వంత్‌పూర్‌లో బయలుదేరి మరుసటి రోజు రాత్రి 11.05 గంటలకు దువ్వాడ, ఆదివారం మధ్యాహ్నం 1.25 గంటలకు సంత్రాగచ్చి చేరుతుంది. 02841 నంబరు గల షాలిమార్-చెన్నై-షాలిమార్ రైలు ఈ నెల 14 నుంచి ఆగస్టు 28 వరకు ప్రతి సోమవారం సాయంత్రం 6.30 గంటలకు షాలిమార్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.08 గంటలకు దువ్వాడ, మంగళవారం రాత్రి 11.30 గంటలకు చెన్నై చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 02842 నంబరు గల రైలు ఈ నెల 16 నుంచి 30 వరకు ప్రతి బుధవారం ఉదయం 4.30 గంటలకు చెన్నైలో బయలుదేరి రాత్రి 7.30 గంటలకు దువ్వాడ, గురువారం ఉదయం 11.20 గంటలకు షాలిమార్ చేరుతుంది.

అమెరికాలో రోడ్డు ప్రమాదం

భీమిలి బీజేపీ కన్వీనర్ కుమార్తె మృతి

భీమునిపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భీమిలి నియోజకవర్గ బీజేపీ కన్వీనరు కంటుభుక్త రామానాయుడు ద్వితీయ కుమార్తె శివాన్విత (19) దుర్మరణం చెందారు. ఈనెల 4వ తేదీన ఈ సంఘటన జరిగింది. అమెరికాలోని కాలిఫోర్నియాలో తన అక్కతో పాటు శివాన్విత కూడా ఉండి చదువుకుంటున్నారు. శాండియాగో యూనివర్శిటీలో సైకాలజీలో గ్రాడ్యుయేషన్ చదువుతున్న శివాన్విత లైబ్రరీకి వెళ్లి వస్తానని చెప్పి, ప్రమాదానికి గురైంది. కాగా రామానాయుడు దంపతులకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె ఎంబీబీఎస్ చేస్తుండగా, చిన్నకుమార్తె గ్రాడ్యుయేషన్ చదువుతున్నారు. రామానాయుడు భార్య సునీత బీజేపీ డివిజన్ అధ్యక్షురాలిగా ఉన్నారు. యువతి మృతితో స్థానికంగా విషాదం నెలకొంది.

9న జడ్పీ సర్వసభ్య సమావేశం

విశాఖపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని చైర్‌పర్సన్ అధ్యక్షతన ఈ నెల తొమ్మిదో తేదీన జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశామని ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.నారాయణ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవు తుందని, జిల్లా ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, ఎంపీపీలు, అధికారులు అందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

పేదరికం లేని సమాజ నిర్మాణమే ప్రభుత్వ ధ్యేయం

జోన్-4 అధికారుల సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ


అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

డాబాగార్డెన్స్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్-2047 లక్ష్యంగా అందరూ కలిసి పనిచేయాలని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే సీహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. సోమవారం జోన్-4 కార్యాలయంలోని పీ4 ద్వారా పేదరికం నిర్మూలించడానికి బంగారు కుటుంబాలు, పోస్టల్ ద్వారా ఎంపిక చేయడానికి దత్తత ప్రక్రియపై దక్షిణ నియోజకవర్గం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం లేని రాష్ట్రాన్ని సాకారం చేయడమే పీ4 లక్ష్యమన్నారు. జోన్ 4 జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు, ఏపీడీ పద్మ, ఏసీపీ ఝూన్సీ, ఈఈ నరసింగరావు, డీఈ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రాలకు పూర్వ వైభవం

కూటమి ప్రభుత్వ హయాంలో అంగన్వాడీ కేంద్రాలకు పూర్వవైభవం వస్తుందని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. దక్షిణ నియోజకవర్గం పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లు, వంట పాత్రలు, ప్రీ స్కూల్ బుక్స్ సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల పనితీరును మరింత మెరుగుపరచాలని సూచించారు. ప్రభుత్వం అందించే వస్తువులను సద్వినియోగం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో నీలిమ, ఏపీడీపీఓ శ్రీలత, సూపర్‌వైజర్ కుమారి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో అధికారుల తనిఖీ


కార్డుదారులతో మాట్లాడుతున్న ఆర్ఐ

మురళీనగర్, జులై 7 (ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల శాఖ సర్కిల్ -1 ఏఎస్ఓ పర్యవేక్షణలో సోమవారం విశాఖ ఉత్తరంలోని రేషన్ దుకాణాలను రెవెన్యూ ఇన్‌స్పెక్టరు తనిఖీ చేశారు. బర్మాక్యాంప్, మురళీనగర్ పరిధి డిపోలను ఆర్ఐ పి.బిందు తనిఖీ చేశారు. షాపుల వద్ద కార్డుదారులతో మాట్లాడిన ఆమె సరుకులు విడిపిస్తున్నారా? లేదా? అని వాకబు చేశారు. పలువురిని కార్డులు అడిగి వివరాలు పరిశీలించారు. పాత, కొత్త విధానాల్లో అనుకూలతపై కార్డుదారులను ప్రశ్నించారు. కందిపప్పు ఎప్పుడిస్తారని చాలామంది కార్డుదారులు ఆర్ఐని అడిగారు.

‘ఆటోల బంద్‌ను విజయవంతం చేయాలి’


సమ్మెకు మద్దతుగా ప్రచారం చేస్తున్న ఆటో కార్మికులు

అక్కయ్యపాలెం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9న బడి పిల్లల ఆటోలను బంద్ చేసి ప్రభుత్వానికి కళ్లు తెరిపించాలని ఏపీ ఆటో డ్రైవర్స్, వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి ఆటో డ్రైవర్లకు పిలుపునిచ్చారు. నరసింహనగర్ రైతుబజారు ఎదురు రోడ్డులో సోమవారం ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు కోడ్‌లుగా కుదించిందని విమర్శించారు. కార్మికులు, ఉద్యోగులకు పని గంటలు పెంచి, వారి అనారోగ్యానికి దారి చూపుతోందన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు దక్కకుండా చేసే కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా 9న నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెలో భాగంగా ఏపీలో ఆటోల బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రవికృష్ణ, జి.నీలకంఠం, పి. సాయికుమార్, జి.ఆదినారాయణ పాల్గొన్నారు.

ఎట్టకేలకు చెట్ల తొలగింపు


నక్కవానిపాలెంలో కూలే స్థితిలో ఉన్న ఈ చెట్లనే తొలగించారు

సీతమ్మధార, జులై 7 (ఆంధ్రజ్యోతి): నక్కవానిపాలెంలోని ఏఎంజీ ఆసుపత్రి రోడ్డులో గల చెట్టును జీవీఎంసీ అధికారులు ఎట్టకేలకు తొలగించారు. నక్కవానిపాలెం నుంచి మద్దిలపాలెం, కెఆర్ఎం కాలనీ తదితర ప్రాంతాలకు వెళ్లే ఈ రహదారిలో మే నెలలో మొదలు కుళ్లిపోయిన చెట్టు కూలిపోవడంతో అప్పుడే అటువైపు వెళ్తున్న ఓ మహిళ కొమ్మల కింద చిక్కుకుని దుర్మరణం చెందారు. కొన్ని వాహనాలు దెబ్బతిన్నాయి. ఆ సమయంలో అక్కడికి విచ్చేసిన ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, కార్పొరేటర్ పద్మారెడ్డిల దృష్టికి స్థానికులు మరో చెట్టు కూడా పడిపోయే స్థితిలో ఉందని తెలపడంతో దాన్ని తొలగించాలని ఎమ్మెల్యే సూచించారు. కానీ ఇంతవరకు ఆ చెట్లను తొలగించలేదు. వర్షం పడినా, గట్టిగా గాలి వీసినా చెట్లు పడిపోతాయేమోనని స్థానికులు భయాందోళనతో ఉండేవారు. ఎట్టకేలకు సోమవారం జీవీఎంసీ సిబ్బంది చెట్లను తొలగించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

ముంతాజ్‌లో నిల్వ ఆహారం

... 5వ పేజీ తరువాయి

అందిస్తున్నారు. అటువంటి ఆహారాన్ని తినడం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలు, కేన్సర్ వంటి వ్యాధుల బారినపడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాబట్టి, వీలైనంత వరకు ఇంట్లో వండిన ఆహార పదార్థాలకు ప్రాధాన్యం ఇవ్వాలంటున్నారు. ఈ మధ్య కాలంలో తనిఖీలు చేస్తున్న అనేక హోటళ్లలో ఇదే విధమైన ఆహార పదార్థాలను గుర్తిస్తున్నామని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ జీవీ అప్పారావు వివరించారు.

10న గురుపౌర్ణమి వేడుకలు

డాబాగార్డెన్స్ జూలై 7 (ఆంధ్రజ్యోతి): డాబాగార్డెన్స్‌లోని శివరామకృష్ణ దేవాలయంలో ఈ నెల 10న గురు పౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్టు ఆలయ పురోహితులు బులుసు సాయికృష్ణ శర్మ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి స్వామివారికి ప్రత్యేక పంచామృత అభిషేకాలు, 11 గంటలకు అన్నాభిషేకం నిర్వహిస్తామన్నారు.

10న విద్యార్థుల తల్లిదండ్రులకు పోటీలు

అక్కయ్యపాలెం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 10న జరగనున్న విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జీవీఎంసీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారి కోరారు. 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులను ఆహ్వానించాలని ఉపాధ్యాయులను కోరారు. తల్లులకు ముగ్గులు, లెమన్ అన్ స్పూన్, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించాలన్నారు. ఎంఈవో రామారావు, దాత ముక్కా కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందన


విద్యార్థినికి ప్రశంసాపత్రం అందిస్తున్న ప్రిన్సిపాల్ షైజీ

జ్ఞానాపురం, జులై 7 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లో భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఇటీవల నిర్వహించిన జాతీయ యువ సాంస్కృతిక కార్యక్రమంలో స్థానిక విద్యార్థినులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించిన స్థానిక సెయింట్ జోసెఫ్ బీఎస్సీ స్టాటిస్టిక్స్ విద్యార్థిని జి.కుంశక, బీబీఏ విద్యార్థిని కె.భావనందితలను సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీ, ఎన్ఎస్ఎస్ అధికారిణి కె.మాణిక్యకుమారిలు అభినందించారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు: జడ్సీ


అర్జీదారుడి సమస్య వింటున్న జడ్సీ రాము

జ్ఞానాపురం, జులై 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే వినతులు సత్వరమే పరిష్కారం అయ్యేలా చర్యలు చేపట్టాలని జోన్-5 జోనల్ కమిషనర్ బి.రాము అధికారులను ఆదేశించారు. గతంలో వచ్చిన ఫిర్యాదులపై అధికారులు, సచివాలయ కార్యదర్శులు సక్రమంగా స్పందించడంలేదని, మళ్లీ ఫిర్యాదులు వస్తున్నాయని ఇటువంటివి రాకుండా చూసుకోవాలని అన్నారు. సోమవారం జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో 3 వినతులు స్వీకరించారు. పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి 2 ,యూసీడీకి 1 అర్జీలను స్వీకరించి సంబంధిత అధికారులకు సమస్యల పరిష్కారం కోసం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఓ.లు బాబురావు, రాజ్యలక్ష్మీ, ఈఈ తారప్రసన్న, ఏపీడీ పుణ్యవతి, కృపానందం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు


సమావేశంలో పాల్గొన్న దళిత నాయకులు

కంచరపాలెం, జులై 7 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ వేడుకలు కంచరపాలెం దరి జాషువానగర్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేశారు. మందకృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా కేకు కోసి శుభాకాంక్షలు తెలియజేశారు. సంఘ ప్రతినిధులు అలమండ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ఈతలపాక సుజాత, 56వ వార్డు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పేదలు, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో రాష్ట్ర ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి పేరెల్లి ఎలీషా, ప్రతినిధులు గొటివాడ నరసింగరావు, గుమ్మడి ఆదినారాయణమూర్తి, పి.వెంకటరమణ, సాధూరావు, కాయిత పైడిరత్నాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పార్కులు అన్యాక్రాంతం!

... 5వ పేజీ తరువాయి

విభాగంలోని సర్వేయర్ ద్వారా సర్టిఫికెట్ సంపాదించాలని యత్నించినా అధికారులు రకరకాల కారణాలతో పెండింగ్‌లో ఉంచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మాజీ ఎమ్మెల్యే ఒకరిని ఇద్దరు వైసీపీ కార్పొరేటర్లు కలిశారు. రాజేంద్రనగర్ పార్కు డీల్‌ను వివరించారు. దీనికి ఆయన కూడా అంగీకరించడంతో అధికారులపై ఒత్తిడి చేసి ప్రైవేటు స్థలంగా సర్వే రిపోర్టు సంపాదించేశారు. ఆ సర్వే సర్టిఫికెట్ ఆధారంగా ఖాళీ స్థలం పన్ను (వీఎల్‌టీ) విధించాలంటూ సదరు ప్రైవేటు వ్యక్తి జీవీఎంసీకి దరఖాస్తు చేసుకోగా జోన్-3 రెవెన్యూ అధికారులు జోనల్ కమిషనర్‌కు పంపించారు. జోనల్ కమిషనర్ కూడా వీఎల్‌టీ విధించేందుకు సమ్మతిస్తూ డీసీఆర్‌కు పంపించారు. ఆ ఫైల్‌లో కొన్ని లొసుగులు ఉన్నట్టు గుర్తించిన డీసీఆర్ ఆ స్థలాన్ని మరోసారి సర్వే చేసి అందులో ప్రభుత్వ భూమి ఏమైనా ఉందా?, లేదా? అని నిర్ధారిస్తూ సర్టిఫికెట్ జత చేయాలని కోరుతూ వెనక్కి పంపించేశారు. దీంతో సదరు ప్రైవేటు వ్యక్తి తన స్థలానికి వీఎల్‌టీ విధించాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించాలంటూ టౌన్ సర్వేయర్ ఇచ్చిన సర్టిఫికెట్ ఆధారంగా హైకోర్టును ఆశ్రయించారు. కేసు హైకోర్టులో ప్రస్తుతం పెండింగ్‌లో ఉంది.

అదేవిధంగా జీవీఎంసీ ఐదో వార్డు పరిధి బొట్టవానిపాలెంలోని ఈడబ్ల్యూఎస్ లేవుట్‌లోని ఐదెకరాల పార్కు స్థలంలో రెండు ఎకరాలను కొందరు కబ్జా చేసి పాకలు వేసినా అధికారులు పట్టించుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అదే వార్డులో సాయినగర్ పార్కు స్థలం తమదని పరిహారంగా తమకు టీడీఆర్ జారీచేయాలంటూ ప్రైవేటు వ్యక్తులు జీవీఎంసీకి దరఖాస్తు చేశారు.

ఇదిగో...అదిగో...

... 5వ పేజీ తరువాయి

చంద్రబాబునాయుడుతో పాటు ఐటీ శాఖ మంత్రి లోకేశ్, పురపాలక శాఖ మంత్రి నారాయణ తరచూ నగరానికి వస్తున్నారు. పది నిమిషాలు తీరిక చేసుకుంటే దీని ప్రారంభోత్సవం జరిగిపోతుంది. పర్యాటకులకు అందుబాటులోకి వస్తుంది. దీనిపై తక్షణమే తగిన నిర్ణయం తీసుకొని ఈ మ్యూజియాన్ని పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావలసి ఉంది.

పదిహేడేళ్లు సేవలు

యుహెచ్-3 హెచ్ హెలికాప్టర్ నేవీలో పదిహేడేళ్లు సేవలు అందించింది. తీర ప్రాంత రక్షణ, విపత్తు సమయాల్లో సహాయక చర్యలు, సముద్రంలో తప్పిపోయిన వారిని గుర్తించి, రక్షించడం వంటి విధులు విజయవంతంగా నిర్వహించింది. గత ఏడాది జూన్ 28వ తేదీన ఐఎన్ఎస్ డేగాలో డీ కమిషనింగ్ జరిగింది. జిల్లాకు ఇస్తామని మ్యూజియంగా మార్చాలని తూర్పు నౌకాదళం కోరగా కలెక్టర్ అంగీకరించారు. దానికి అవసరమైన 23 సెంట్ల స్థలాన్ని బీచ్‌రోడ్డులో కేటాయించారు. సీఎం చంద్రబాబు దీనిపై సమీక్షించినప్పుడు 2025లో న్యూఇయర్ బహుమతిగా అందిస్తామని వీఎంఆర్డీఏ అధికారులు చెప్పారు. అనుకున్నట్టుగానే సంక్రాంతికి సిద్ధం చేశారు. అప్పటి నుంచి ప్రారంభోత్సవానికి ఎదురు చూస్తోంది.

ఓటరు జాబితాల సవరణపై శిక్షణ


సూచనలు చేస్తున్న ఈఆర్ఓ జ్ఞానవేణి


సమావేశంలో పాల్గొన్న బీఎల్‌వోలు

సీతమ్మధార, జులై 7 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధారలోని అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల నియమావళికి సంబంధించి ఓటరు జాబితాపై బూత్ లెవెల్ ఆఫీసర్లకు (బీఎల్‌వోలు) సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఉత్తర నియోజకవర్గం ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్ఓ) జ్ఞానవేణి ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఓటరు జాబితాలో ఫామ్ 6, 7, 8 అంశాలపై పలు సూచనలు చేశారు. ఉత్తర నియోజకవర్గంలోని 272 మంది బీఎల్‌వోలకు దశలవారీగా (50 మందికి ఒక గ్రూపుగా చేసి) ఓటరు జాబితా మార్పులు, చేర్పులు, ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షకులతో పూర్తి స్థాయిలో బీఎల్‌వోలకు ఫామ్ 6లో కొత్తగా ఓటర్‌ను చేర్పించడం, ఫామ్ 7 ఓటరు జాబితాలో ఉన్న వారిని సరిచేయడం, మృతుల పేర్లను తొలగించడం, ఫామ్ 8 ప్రకారం మార్పులు, చేర్పులు, చిరునామాలు, ఫోటోలు, వయస్సు తదితర అంశాలను పరిశీలించి జాబితాను సరిచేసే అంశాలపై అవగాహన కల్పించారు.


పథకానికి సంబంధించిన కరపత్రాలతో ఏడీసీ పార్థసారథి, ఏఈ రామకృష్ణ, తదితరులు

'సూర్య ఘర్'లో ప్రజలంతా భాగస్వాములు కావాలి

ఆటోనగర్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకాన్ని ప్రజలకు చేరువ చేసేందుకు తాము ఎంతో కృషి చేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ ఏడీసీ అడబాల పార్థసారథి, ఏఈ రాయుడు రామకృష్ణ అన్నారు. 70వ వార్డు శ్రీనివాస నగర్‌లో ఈ పథకం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి వినియోగదారుడు సూర్య ఘర్ యోజన పథకంలో భాగస్వాములు కావాలని కోరారు. విద్యుత్ బిల్లులను తగ్గించుకునేందుకు ఈ పథకం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని, ఇందుకోసం అందరూ సోలార్ రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డి.శ్యామ్, నరసింహరావు, ప్రసాద్, చిట్టిబాబు విద్యుత్ శాఖ సిబ్బంది, లైన్‌మెన్లు, తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 14 వినతులు

గాజువాక, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో అధికారులు 14 వినతులను స్వీకరించారు. జోన్ పరిధిలో రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, వీధి లైట్లు వేయాలని, కుక్కల బెడద నివారించాలని కోరుతూ ఆయా ప్రాంతాల ప్రజలు, ప్రజా సంఘాల ప్రతినిధులు వినతిపత్రాలను అందజేశారు. వినతులను స్వీకరించిన జోనల్ కమిషనర్ శేషాద్రి వాటిని త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు.

నిత్యావసర సరకుల వితరణ

అగనంపూడి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన నిరుపేద కుటుంబానికి స్థానిక సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అండగా నిలిచింది. అగనంపూడిలో నివాసం ఉంటున్న ఆ కుటుంబ సభ్యులను సోమవారం కలిసి నిత్యావసర సరకులను అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి భాస్కర రాజు, ప్రజా సంఘాల నాయకులు పట్టా రామ అప్పారావు, గుదే సుశీలగజేంద్రర రావు, గోవిందరావు, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురుపూజోత్సవం

పెదగంట్యాడ, జులై 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) పెదగంట్యాడ శాఖ ఆధ్వర్యంలో సోమవారం వికాస్‌నగర్ బాలగౌరి ఫంక్షన్ హాల్‌లో ఆర్ఎస్ఎస్ గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ సభ్యుడు ఎన్.వీర్రాజు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి విలక్షణమైనదని, ప్రపంచదేశాలన్నీ మన సంస్కృతిని అనుకరిస్తున్నాయన్నారు. మన సంస్కృతిలో గురుశిష్యుల అవినాభావ సంబంధానికి ప్రత్యేకత ఉందన్నారు. ఆర్ఎస్ఎస్ సభ్యులు పూజారి రమణయ్య, వినోద్‌కుమార్, ఎరుకునాయుడు, గురప్పరెడ్డి, సూర్యప్రకాశరావు, పి.వెంకటనాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **తమ్ముడు** : మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక)
- **జురాసిక్ వరల్డ్** : జగదాంబ, రమాదేవి
- **కన్నప్ప** : జగదాంబ, కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ),
- **కుబేర** : సంగం, ఊర్వశి (కంచరపాలెం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఎఫ్.1** : రమాదేవి, జగదాంబ,
- **మార్గన్** : శారద, శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 30, వంకాయలు (తెలుపు) 42, వంకాయలు (నలుపు) 40, బెండకాయలు 40, పచ్చిమిర్చి 58, కాకరకాయలు 36, బీరకాయలు 40, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 20, క్యారెట్ 44, దొండకాయలు 44, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది)50, బరబాటి 38, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 45, బద్దచిక్కుడు 50, దోస కాయలు 16, వెల్లుల్లి (పెద్దవి) 90, కొబ్బరి కాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 110, కీర దోస 34, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 34, చిలగడదుంపలు 36, కంద 64, దేముడు చిక్కుడు 78, గోరు చిక్కుడు 44, కూర పెండలం 30, బ్రకోలి 45, నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	560
విజయనగరం	564
శ్రీకాకుళం	564

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	78
లైవ్ ధర	98
విత్ స్కిన్	166
స్కిన్‌లెస్	176

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు
రూ.3.53 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెదగంట్యాడ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 75వ వార్డు పరిధిలో రూ.3.53 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులను సోమవారం ఆయన నెల్లిముక్కు పెంటమాంబ ఆలయ సమీపంలో శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని సీఎం చంద్రబాబు అమలు చేస్తున్నారన్నారు. వైసీపీ హయాంలో ఐదేళ్లపాటు తిరోగమనంలో పయనించిన రాష్ట్ర ప్రగతిని చంద్రబాబు తిరిగి గాడిలో పెట్టారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారని పల్లా శ్రీనివాసరావు అన్నారు. నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.


నెల్లిముక్కులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన పల్లా శ్రీనివాసరావు

కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు, టీడీపీ నాయకులు పులి వెంకట రమణారెడ్డి, పి.సోమునాయుడు, యు.అప్పారావు, డి.పెరుమాళ్లు, ఎం.రమణ, ఎం.అప్పలనాయుడు, పెంటమాంబ ఆలయ కమిటీ సభ్యులు గొందేశి సత్యారావు, పి.కుంచారావు, పి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

'సుపరిపాలన'లో 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్

కూర్మన్నపాలెం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని 87వ వార్డు కార్పొరేటర్ బొండా జగన్ అన్నారు. వార్డు పరిధిలోని గవరవీధిలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయనతో పాటు పలువురు నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు ఎస్ఎస్ విజయరామరాజు, నాయకులు సూరిశెట్టి పెంటారావు, బి.రాజన్‌రాజు, బి.నాగేశ్వరరావు, దానయ్య, శ్రీను, తదితరులు పాల్గొన్నారు. అలాగే 86వ వార్డు వుడా నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రజలకు సుపరిపాలన అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. నాయకులు వేగుంట శ్రీనువాస్, గణపతి, రమేశ్, జగదీశ్, సుబ్బయ్య, నాగార్జున, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు. 71వ వార్డు శ్రీనగర్‌లో చేపట్టిన కార్యక్రమంలో కార్పొరేటర్ రాజాన రామారావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. నాయకులు పప్పు శంకరరావు, నాయుడు, ప్రతాపరావు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా 70వ వార్డు ఎల్వీ నగర్‌లో టీడీపీ నాయకులు చట్టి గోపి, కేవీఎస్ శంకరరావుల ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. 88వ వార్డు పరిధి యాదవ జగ్గరాజుపేటలో టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి గొలగాని సన్యాసిరావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.


87వ వార్డు గవర వీధిలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న బొండా జగన్

పెదగంట్యాడ: కూటమి ప్రభుత్వ ఏడాది పాలన సంతృప్తకరంగా ఉన్నట్టు ప్రజలంతా చెబుతున్నారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 75వ వార్డు పరిధి ఎన్టీఆర్ సెంటర్‌లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, నాయకులు నమ్మి అప్పారావు, ములకలపల్లి పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు నిర్వాసితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వాలు చొరవ చూపాలి

» మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

అగనంపూడి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఉక్కు కర్మాగార నిర్మాణం కోసం విలువైన భూములిచ్చిన నిర్వాసితులకు న్యాయం జరిగేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు నిర్వాసితుల ఐక్య సంఘం, నిర్వాసిత కాంట్రాక్టు లేబర్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పెదమడక కమ్యూనిటీ హాల్ వద్ద జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్టీల్ ప్లాంటును స్థాపించి నాలుగు దశాబ్దాలు పూర్తయినా నిర్వాసితులకు న్యాయం జరగకపోవడం దారుణమన్నారు. ప్లాంటులో నిర్వాసితులందరికీ శాశ్వత ఉపాధి కల్పించాలని, లేకుంటే మిగుల భూములను వారికి ఇవ్వాలన్నారు. అది కూడా కుదరని పక్షంలో నిర్వాసిత కుటుంబానికి కోటి రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ మాజీ సలహాదారు మహదేవ్ మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి భూములిచ్చిన వారిని నిర్వాసితులుగా కాకుండా భూ దాతలుగా గుర్తించాలన్నారు. సమావేశంలో నిర్వాసిత కార్మిక సంఘం నాయకులు విందుల చిరురాజు, గల్లా రామకృష్ణ, వెంకటేశ్, నారాయణరావు, బి.పైడిరాజు, నరసింగరావు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శోభనాద్రీశ్వరరావు

స్టీల్ ప్లాంట్ టీపీపీ నూతన విభాగాధిపతికి సత్కారం

ఉక్కుటౌన్‌షిప్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ టీపీపీ నూతన విభాగాధిపతిగా నియమితులైన ప్రమోదకుమార్ దాస్‌ను సోమవారం ఇంటక్ నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్లాంటుకు ఎంతో కీలకమైన టీపీపీ విభాగాధిపతిగా ప్రమోదకుమార్ దాస్ రావడం ఆనందంగా ఉందని, ఉక్కు ఉద్యోగుల ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం విభాగాధిపతి మాట్లాడుతూ అధికారులు, ఉద్యోగులు సమష్టిగా పనిచేసి ఉత్పత్తి పెంచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యూనియన్ ప్లాంట్ అధ్యక్షుడు పీవీ రమణమూర్తి, ప్రధాన కార్యదర్శి బీఎన్ రాజు, నాయకులు జి.నరసింగరావు, ఎం.అప్పలరాజు, వెంకన్న, కె.ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే ధ్యేయంగా కూటమి పాలన

» ఎంపీ శ్రీభరత్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో కూటమి పాలన సాగుతోందని ఎంపీ ఎం.శ్రీభరత్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు పేర్కొన్నారు. జీవీఎంసీ 59వ వార్డులో సోమవారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని, ఎన్నికల హామీలను అమలుచేస్తోందన్నారు. వైసీపీ మాయమాటలను ప్రజలు విశ్వసించడం లేదన్నారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని, త్వరలో ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, రామ్మోహన్‌నాయుడు, ఉరుకూటి హరిబాబు, మితిరెడ్డి శంకర్, డొంకన రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు, చిత్రంలో ఎంపీ శ్రీభరత్, నేతలు

జంగాలిపాలెంలో తొలి అడుగు

పెందుర్తి: మండలంలోని జంగాలిపాలెంలో సర్పంచ్ గొరపల్లి నరసింగరావు ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి జడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి నారాయణరావు హాజరయ్యారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాల అమలు, ఏడాదిలో ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరించారు. కరపత్రాలను అందజేశారు. తెలసారి చలపతి, నరేశ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక దినోత్సవం


మాదిగపేటలో డప్పు కొడుతున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. ఎస్సీ కాలనీలో రామ్-రాంజీ సంక్షేమ సంఘం వద్ద ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) పతాకాన్ని ఎగరవేసి, వందేభారత్ బ్లడ్ సెంటర్ సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం ప్రారంభించారు. ఆయనకు డప్పులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దరువు వేశారు. మల్కాపురం మెయిన్‌రోడ్డులో పెద్దాడ చిన దాలయ్య, పెద్దాడ నూకరాజు పతాకాన్ని ఆవిష్కరించారు. అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు ఎమ్మెల్యే గణబాబు పూలమాలలు వేశారు. ములగాడ హౌసింగ్‌కాలనీలో కింతాడ రాజశేఖర్, నీలారావు, సుదర్శన్, వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు. ములగాడలోనూ ఎమ్మెల్యే గణబాబు పాల్గొన్నారు.

విద్యార్థి భద్రత అందరి బాధ్యత: సీఐ

పెందుర్తి, జూలై 7(ఆంధ్రజ్యోతి): విద్యార్థి భద్రత అందరి బాధ్యతని సీఐ కేవీ సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో విద్యార్థుల మానసిక రుగ్మత అంశంపై ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థుల భద్రత, భరోసా, భవితపై దృష్టి సారించాలన్నారు. ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలు, ఫోన్ల వినియోగం, లైంగిక వేధింపులు, డ్రగ్స్, సైబర్ నేరాలు పెరుగుతున్నాయన్నారు. ఆపదలో ఉంటే పోలీసులు అండగా నిలుస్తారన్నారు. సదస్సులో కళాశాల అధ్యాపకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న సీఐ సతీశ్‌కుమార్

విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం


ఎన్ఏడీ జంక్షన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం గవరవీధిలో 30 ఇళ్లకు విద్యుత్తు సరఫరాలో తలెత్తుతున్న సమస్యలపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు సోమవారం కొత్త కేబుల్స్ వేశారు. గోపాలపట్నం విద్యుత్ అధికారి పర్యవేక్షణలో పనులు చేపట్టారు. స్థానికులు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీహరిపురం ఆస్పత్రిని ప్రైవేటుకు అప్పగించొద్దు: సీపీఎం

మల్కాపురం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): శ్రీహరిపురంలోని జీవీఎంసీ ఫస్ట్ రిఫరల్ ఆస్పత్రి (ఎఫ్ఆర్‌యు)ని ప్రభుత్వమే నడపాలని సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ఆస్పత్రి ప్రధాన ద్వారం వద్ద ఆందోళన చేపట్టారు పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, కార్పొరేటర్ గంగారావు మాట్లాడారు. ఆస్పత్రిని తక్కువ ఫీజుతో కోరమాండల్ కంపెనీ నడపాలని జీవీఎంసీ కమిషనర్ సూచించడం బాధ్యతరాహిత్యానికి నిదర్శనమన్నారు. ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టి ప్రజల ఆరోగ్య రక్షణ నుంచి తప్పుకొనే ప్రయత్నం దారుణమన్నారు. వైసీపీ ప్రభుత్వం ఆస్పత్రిని నిర్వీర్యం చేసిందని, ఎమ్మెల్యే గణబాబు కార్పొరేట్ ఆస్పత్రిగా తీర్చిదిద్దుతామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కె.పెంటారావు, ఆర్.లక్ష్మణమూర్తి, మమత, విమల, సత్యారావు, శ్రీనివాసరావు, రమణ పాల్గొన్నారు.

జీవీఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు

మల్కాపురం: శ్రీహరిపురం జీవీఎంసీ ఆస్పత్రి (ఎఫ్ఆర్‌యు)ని కోరమాండల్ కంపెనీకి ఇవ్వవద్దని 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేశ్ జీవీఎంసీ కమిషనర్‌కు సోమవారం పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వినతి పత్రం అందజేశారు. కోరమాండల్ కంపెనీ వలన భూగర్భజలాలు కలుషితమవుతున్నాయని, కాలుష్యంతో జనం ఆరోగ్యం పాడవుతోందన్నారు. తమిళులకే ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. ఆ కంపెనీకి 30 సంవత్సరాల పాటు ఆస్పత్రి బాధ్యతలు ఎలా అప్పగిస్తారని ప్రశ్నించారు.


ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న సీపీఎం నేతలు

బీఎల్ఓల శిక్షణ ప్రారంభం

ఎన్.ఎ.డి.జంక్షన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 52వ వార్డు ఎన్ఏడీ శాంతినగర్ కమ్యూనిటీ హాల్‌లో సోమవారం బీఎల్‌వోల శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని వారంతా శిక్షణకు హాజరయ్యారు. బీఎల్‌వోల విధులు, నిర్వర్తించే విధానం, ఓటరు నమోదు ప్రక్రియలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యవహారశైలి, ఫామ్ 6 ఇతర అంశాలపై మాస్టర్ ట్రైనీలు వారికి శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది. వార్డుల వారీగా ఈనెల 11 వరకు శిక్షణ తరగతులు జరుగుతాయని గోపాలపట్నం తహసీల్దార్ రమేశ్ తెలిపారు.


భెల్ హెచ్‌పీవీపీ మెయిన్ గేటు వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలి

సీఐటీయూ భెల్ హెచ్‌పీవీపీ ప్రధాన కార్యదర్శి ప్రకాశ్

అక్కిరెడ్డిపాలెం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారంతో పాటు హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని సీఐటీయూ భెల్ హెచ్‌పీవీపీ ప్రధాన కార్యదర్శి జీటీవీ ప్రకాశ్ అన్నారు. సీఐటీయూ, ఇంటక్ ఆధ్వర్యంలో సోమవారం పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ భెల్ హెచ్‌పీవీపీ మెయిన్ గేటు వద్ద కార్మికులు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రకాశ్ మాట్లాడుతూ ఈ నెల 9న దేశవ్యాప్తంగా జరగనున్న కార్మిక సమ్మెను భెల్ హెచ్‌పీవీపీలో విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సనపల జగన్నాథరావు, వి.ఆనందరావు, సీహెచ్ మురళీశ్వరరావు, హనుమాన్, అచ్చెన్నాయుడు, బోగేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ

అగనంపూడి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి అగనంపూడి ఆంజనేయస్వామి ఆలయ కూడలి వద్ద సోమవారం ఉదయం పెను ప్రమాదం తప్పింది. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి నుంచి గాజువాక వస్తున్న లారీని అగనంపూడి ఆంజనేయస్వామి ఆలయ జంక్షన్ వద్దకు వచ్చేసరికి రెడ్ సిగ్నల్ పడడంతో డ్రైవర్ ఆపాడు. అదే సమయంలో వెనక నుంచి ఫ్లైయాష్ లోడుతో వస్తున్న మరో లారీ అదుపు తప్పి సిగ్నల్ వద్ద ఆగి ఉన్న లారీను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆ లారీ డ్రైవరుకు స్వల్ప గాయాలవ్వగా, వాహనం ముందు భాగం బాగా దెబ్బతింది. ఈ కారణంగా ట్రాఫిక్ స్తంభించిపోవడంతో స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్ పోలీసులు ఆ లారీలను క్రేన్ సాయంతో తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్‌కు వినతి

అక్కిరెడ్డిపాలెం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వెంకటేశ్వర కాలనీలో వాటర్ ట్యాంకును ఏర్పాటు చేయడంతో పాటు రోడ్లు, కాలువలకు మరమ్మతులు చేయాలని కోరుతూ సోమవారం 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డికి కాలనీ సంఘ నాయకులు వినతిపత్రం అందజేశారు. కాలనీలో వాటర్‌ట్యాంక్ లేకపోవడంతో వేసవిలో నీటి సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. అలాగే స్థానికంగా ఒపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ సంఘ ప్రతినిధులు నాయకులు ఎ.వీర్రాజు, పి.పార్వతీశం, మోహన్‌రావు, రాజారావు, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జోన్ మార్పు ప్రతిపాదనను విరమించాలి

అగనంపూడి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 79వ వార్డు జోన్ మార్పు ప్రతిపాదనను విరమించాలని కోరుతూ కమిషనర్ కేతన్ గార్గ్‌కు జనసేన పార్టీకి చెందిన నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. పాలనా సౌలభ్యం పేరుతో ఈ వార్డును వేపగుంటలోని జోన్-8లో కలిపేందుకు ప్రతిపాదనలు చేశారని, దీనిని విరమించాలని వేడుకున్నారు. కమిషనర్‌ను కలిసిన జనసేన వార్డు అధ్యక్షుడు మేడిశెట్టి విజయ్, కిరణ్‌కుమార్, సాయి, ప్రసాద్, నరేశ్, తదితరులు ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ

అక్కిరెడ్డిపాలెం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం హరిజన జగ్గయ్యపాలెంలో ఎమ్మార్పీఎస్ జెండాను కాలనీ అధ్యక్షుడు గుమ్మడి రామాంజనేయులు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ షెడ్యూల్ కులాల అభ్యున్నతి కోసం ఎమ్మార్పీఎస్ ఎంతో కృషి చేస్తుందన్నారు. కాలనీ నాయకులు వంగలపూడి గోపి, ఉప్పాటి ప్రవీణ్, ఆనంద్, వసంత్, చిన్న, కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీ అభివృద్ధిలో భాగస్థులు కావాలి

» పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ) అభివృద్ధిలో అందరూ భాగస్తులు కావాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పేర్కొన్నారు. సీహెచ్‌సీలో సోమవారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీని నియమించారు. ఛైర్మన్‌గా ఎమ్మెల్యే పంచకర్ల, సభ్యులుగా బండారు వరూధిని, రాపర్తి శంకర్‌ప్రసాద్‌లతో ఎమ్మెల్యే ప్రమాణం చేయించారు. సీహెచ్‌సీ వైద్యాధికారి దొర, జెడ్పీ హైమావతి, ఎంపీడీవో గుండాల అప్పలరాజు ప్రతినిధులుగా వ్యవహరిస్తారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. వారం రోజుల్లో కమిటీ సమావేశమై అన్ని అంశాలపై సమీక్షిస్తుందన్నారు. సమావేశంలో అయితి సింహాచలం, పిళ్లా జగన్మోహనపాత్రుడు పిన్నింటి పార్వతి, కంచిపాటి మధు, గొర్లె అప్పారావు, ఆర్ఎస్ నాయుడు, కరక దేవుడు పాల్గొన్నారు.


కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే పంచకర్ల

'హెచ్‌పీసీఎల్‌లో స్థానికులకు ఉపాధి కల్పించాలి'

మల్కాపురం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): హెచ్‌పీసీఎల్‌లో స్థానికులకు ఉపాధి కల్పించాని, ఈనెల 9న కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని సోమవారం అఖిలపక్ష ట్రేడ్ యూనియన్ నేతలు బైక్ ర్యాలీ నిర్వహించారు. పైప్‌లైన్ జంక్షన్ నుంచి జింక్ గేటు వరకు 9న భారీ ర్యాలీ ఉంటుందన్నారు. కాండ్రేగుల సత్యంజనేయ, సత్యనారాయణ, నాగభూషణం, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

8 వినతుల స్వీకరణ

వేపగుంట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 8 వినతులు అందాయి. లక్ష్మీపురంలో వీధి దీపాల ఏర్పాటు, శివారు కాలనీలో రోడ్ల మరమ్మతులు, దగ్గువానిపాలెంలో అక్రమ నిర్మాణం, బీఆర్‌టీఎస్ విస్తరణలో భూమి కోల్పోయిన వారికి టీడీఆర్‌లపై జెడ్సీ కె.హైమావతి వినతులు స్వీకరించారు.

గిరిజన ఐక్య వేదిక అధ్యక్షుడిగా చిట్టిబాబు

పెందుర్తి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఐక్య వేదిక జిల్లా కమిటీ అధ్యక్షుడిగా పెందుర్తికి చెందిన లకే చిట్టిబాబు నియమితులయ్యారు, గిరిజన భవన్‌లో సోమవారం నిర్వహించిన ఐక్య వేదిక సర్వసభ్య సమావేశంలో చిట్టిబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పలువురిని సభ్యులుగా నియమించారు. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తామని కమిటీ పేర్కొంది.


చిట్టిబాబు అభినందిస్తున్న దృశ్యం

ఘనంగా గరిమ సాంస్కృతిక వేదిక పుష్కరోత్సవం

గోపాలపట్నం, జూలై 7(ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో గరిమ సాంస్కృతిక వేదిక పుష్కరోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. అభ్యుదయ సాహిత్యం ఆది శంకరుల విశిష్టత అంశంపై ఏర్పాటుచేసిన చర్చాగోష్టిలో రచయిత్రి దామరాజు విశాలాక్షి మాట్లాడారు. శతకాలు, పద్యాలు, గేయాలు బోధిస్తూ ఆదిగురువుగా శంకరాచార్యులు సుప్రసిద్ధ సాహిత్యాన్ని ప్రపంచానికి అందించారన్నారు. గ్రంథాలయాధికారి ఎస్వీ నరసింహం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మల్లాది సోమేశ్వర శర్మ, సీహెచ్ చిన సత్యనారాయణ, జి.రామదాసు, ఎం.అప్పారావు, రామ్‌ప్రసాద్, ముహ్మద్ అజీజ్ తదితరులు ప్రసంగించారు.


మాట్లాడుతున్న రచయిత్రి విశాలాక్షి

చికాకు పెట్టే అలర్జీలు



అలర్జీ... చికాకు పెట్టే రుగ్మత. ఎక్కువమందిలో సాధారణంగా కనిపించే సమస్య. వాసన, దుమ్ము, ధూళి, ఆహారం... ఇలా ఎన్నో అంశాలు దీనికి కారణం. ఈ సమస్యతో ఏళ్లుగా బాధపడుతున్న వారు కూడా గుర్తించలేరు. శరీరంపై దురద, పొక్కులతో ఇబ్బందులు పడుతున్నా కారణం తెలియక అల్లాడుతుంటారు. ప్రాణాంతకం కాకున్నా ఇది ప్రమాదకరమైన సమస్యేనని, అవగాహన తప్పనిసరని వైద్య నిపుణులు చెబుతున్నారు.

శారీరకంగా ఎన్నో ఇబ్బందులు

- గాలి, ఆహారం, డ్రగ్స్ తదితర కారణాలు
- కాలుష్యంతోనూ తీవ్రమయ్యే సమస్య
- ఇటీవల పెరుగుతున్న బాధితుల సంఖ్య
- నేడు అంతర్జాతీయ అలర్జీ డే

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

పీల్చేగాలి, తాగేనీరు, తీసుకునే ఆహారం తదితరాల్లోని ప్రతికూల అంశాలకు శరీరం స్పందిస్తుంది. దీనినే అలర్జీ అంటారు. ఇది చేసేపనిపై ధ్యాసపెట్టలేనంతగా చికాకుపెడుతుంది. కాలుష్య సమస్య పెరిగాక అలర్జీ బాధితుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో అలర్జీపట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏటా జూలై 8న 'ఫిలిప్పీన్ సొసైటీ ఆఫ్అలర్జీ' అంతర్జాతీయ అలర్జీ డే నిర్వహిస్తోంది.

ధూళి నుంచి పుప్పొడి రేణువులవరకు... వాతావరణంలో దుమ్ము, ధూళి కాలుష్యం కారణంగా కొంత మందిలో అలర్జీ కనిపిస్తుంది. కొందరికి చల్లని గాలులు, మరికొంత మందికి పూలపై ఉండే పుప్పొడి రేణువులు, ఇంకొందరికి గాలిలో ఎగిరే చిన్నగుడ్లు, సూక్ష్మక్రిముల వల్ల అలర్జీ వస్తుంది. ముక్కు ప్రవేశించే క్రమంలో అక్కడ అడ్డుకునే రక్షణ వ్యవస్థ పనిచేస్తుంది. ఈ సమయంలోనే తుమ్ములు వస్తాయి. దాంతో వాపు, ఎర్రగా మారడం, నీరుకారుతుంది. ఆయా పదార్థాలు లోపలికి ప్రవేశిస్తే ఆయాసం రూపంలో అలర్జీ బయటపడుతుంది. శరీరంలో రక్షణ వ్యవస్థ బలహీనమైతే ఊపిరితిత్తులపైనా దాడిచేస్తాయి.

ఇవీ కారణాలు

వస్తువులు, జంతువులు, వాయువుల కారణంగా అలర్జీ రావచ్చు. దీనిని పూర్తిగా నివారించే మందులు లేవు. పర్యావరణ సమతుల్యం దెబ్బతినడం వల్ల కాలుష్యం పెరిగి అలర్జీ సమస్యలు తలెత్తుతున్నాయి. బాధితుల్లో భిన్న లక్షణాలు కనిపిస్తాయి.

చర్మ అలర్జీ

చర్మ సంబంధిత అలర్జీ చిన్నారుల్లో ఎక్కువ. కొన్ని రకాల మందులు, ఆహార పదార్థాలు పడకపోవడం వల్ల చర్మంపై దురద, దద్దుర్లు, ఎరుపెక్కుతాయి.

జీర్ణకోశ అలర్జీ

కొంతమందికి కొన్ని ఆహార పదార్థాలు పడకపోవడం వల్ల జీర్ణకోశ అలర్జీలు వేధిస్తాయి. వికారం, వాంతులు, నీరసం, మలబద్ధకం, విరోచనాల సమస్యలు తలెత్తుతాయి



చర్మం...ముక్కు అలర్జీలు

అలర్జీల్లో అత్యధికం చర్మం, ముక్కు (రైనటిస్) అలర్జీలే. ఆరుశాతం ఆహారం, సుమారు 18 శాతం వరకు ఆస్తమాకు సంబంధించినవి మిగిలినవన్నీ ఇతర రకాల అలర్జీలు. అలర్జీకి చికిత్స' లేదు. శరీరానికి పడని వాటికి దూరంగా ఉండడమే ఉత్తమం. దేనివల్ల అలర్జీ వస్తుందో గుర్తించి వాటిని దరిచేరనీయకూడదు. చల్లగాలి పడనివారు బయటకు వెళ్తే ముఖానికి స్కార్ఫ్ కట్టుకోవాలి, ఎండ పడనివారు ఎండ తగలకుండా ఏర్పాట్లు చేసుకోవాలి. రంగులు, సెంట్ల వాసనలు పడనివారు వాటికి దూరంగా ఉండాలి.

జంతువుల వల్ల

కొందరికి పెంపుడు జంతువులవల్ల అలర్జీలు వస్తాయి. వాటిని సరిగా శుభ్రం చేయకపోయినా, వాటి వెంట్రుకల్లోని రేణువులు గాలిలో కలిసి, మనం పీల్చినప్పుడు అలర్జీల బారిన పడతారు. దుప్పట్లు, దిండ్లు, గలేబులు ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోతే క్రిములు ముక్కు, నోటి ద్వారా శరీరంలోకి ప్రవేశించి అలర్జీ సమస్య సృష్టిస్తాయి.

పెరుగుతున్న బాధితుల సంఖ్య



వివిధ రకాల అలర్జీలతో బాధపడుతున్న వారి సంఖ్య ఇటీవల పెరుగుతోంది. ఒక సంస్థ 30 దేశాల్లో నిర్వహించిన సర్వే ప్రకారం 50 శాతం మంది ప్రజలు చర్మ, కంటి, ఇతర అలర్జీలతో బాధపడుతున్నట్టు తేలింది. లంగ్స్, సైనస్ అలర్జీ (ఆస్తమా, బ్రాంకైటిస్) మన ప్రాంతంలో కనిపిస్తున్నాయి. దీనికి ప్రత్యేకంగా వైద్యం ఉండదు. కారణాన్ని గుర్తించి, వాటికి దూరంగా ఉండడం, జాగ్రత్తలు తీసుకోవడమే. పిల్లల్లో చైల్డ్‌హుడ్ ఆస్తమా కనిపిస్తుంది. తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. ఐదారేళ్ల తరువాత క్రమంగా తగ్గుముఖం పడుతుంది.

- డాక్టర్ ఎస్ఎన్ఆర్ నవీన్, జనరల్ మెడిసిన్ వైద్య నిపుణులు, కేజీహెచ్

జన విజ్ఞానవేదిక నూతన కార్యవర్గం




అధ్యక్షుడు కృష్ణారావు, కార్యదర్శి ప్రసాద్

విశాఖపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులుగా ఎల్.కృష్ణారావు, వైఏఆర్కే ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎస్ఏడీ జంక్షన్‌లోని హస్మీభవన్‌లో ఆదివారం జరిగిన జిల్లా మహాసభల్లో కార్యవర్గం ఎన్నిక జరిగింది. గౌరవాధ్యక్షులుగా డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, డాక్టర్ రమేష్‌కుమార్, ఉపాధ్యక్షులుగా వైవీ రత్నారావు, కె.శేషగిరిరావు, డాక్టర్ పి.లక్ష్మణస్వామి, ఎ.వాసుదేవరావు, కోశాధికారిగా ఎస్‌వీ రమణ, కార్యదర్శులుగా ఎస్‌వీకే పరశురామ్, చంద్రశేఖర్, పీవీ రమణ, నరసింహమూర్తి, సింహాచలం ఎన్నికయ్యారు. సబ్‌కమిటీలకు ఇందు శ్రీనివాస్, యు.కొండలరావు, వెంకటరాజు, బి.అప్పలరెడ్డి, త్రినాధ్, తేజ, ఆనందపురం త్రినాథ్, పీవీ గోపాలరావు, కేవీ ప్రసాద్, వెంకటరావు, డి.ఈశ్వరరావు, వంగపండు దుష్యంత్, ఎంవీఆర్ఎస్ శ్రీకాంత్, చిలకా మూర్తి ఎన్నికయ్యారు.

జైపూర్-కిరండూల్ ప్రత్యేక రైలు

విశాఖపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జైపూర్-కిరండూల్ మధ్య ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈ నెల 8 నుంచి 10 వరకు మధ్యాహ్నం 2.50 గంటలకు జైపూర్‌లో బయలుదేరి అదేరోజు రాత్రి 8.45 గంటలకు కిరండూల్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 9 నుంచి 11 వరకు ఉదయం 6 గంటలకు కిరండూల్‌లో బయలుదేరి అదేరోజు మధ్యాహ్నం 11.40 గంటలకు జైపూర్ చేరుతుంది.

ప్రయోగశాలలో సీనియర్ అనలిస్ట్ పోస్టు ఖాళీ

విశాఖపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రాంతీయ ప్రజారోగ్య ప్రయోగశాలలో నీటి పరీక్షలు నిర్వహించే సీనియర్ అనలిస్ట్ పోస్టు ఖాళీ అయింది. ఆరేళ్లుగా సేవలందిస్తున్న వై.శివరామకృష్ణ బదిలీపై గుంటూరు వెళ్లారు. ఈ స్థానంలో ఎవరినీ నియమించలేదు. దీంతో పరీక్షల నిర్వహణపై ప్రభావం పడనుంది. ఈ కేంద్రానికి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల నుంచి నెలకు 300 వరకు నీటి నమూనాలు వస్తుంటాయి. సీనియర్ అనలిస్టు ఆధ్వర్యంలో సిబ్బందిపరీక్షలు నిర్వహించి నివేదికలు ఇస్తారు. వాటి ఆధారంగా నీటిలో కెమికల్స్, రసాయనాలు తెలుసుకుని తాగేందుకు వినియోగించవచ్చా? లేదా.? ఇతర అనారోగ్య కారకాలున్నాయా నిర్ధారించుకుంటారు. కీలకమైన సీనియర్ అనలిస్టు బదిలీపై వెళ్లడంతో పరీక్షలపై ప్రభావం పడనుంది. మరోవైపు సీనియర్ అనలిస్టు డ్రాయింగ్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నారు. పోస్టు ఖాళీ కావడంతో 15 మంది జీత, భత్యాలకు సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు.

ట్రాఫిక్ పోలీసులకు 200 కూలింగ్ హెల్మెట్ల పంపిణీ

- 64 ద్విచక్రవాహనాలు, రెండు డ్రోన్‌లు అందించిన హోంమంత్రి అనిత



మహిళా పోలీసుకు హెల్మెట్ అమరుస్తున్న హోం మంత్రి

మహారాణిపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది భద్రత, సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్నట్లు హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకొని పోలీసు శాఖలో మార్పులు తీసుకువస్తున్నామని, సిబ్బందికి సౌకర్యాలు కల్పిస్తే సమర్థంగా పనిచేస్తారని అభిప్రాయపడ్డారు. సోమవారం బీచ్ రోడ్డులోని కాళీమాత ఆలయం వద్ద నిర్వహించిన సమావేశంలో ట్రాఫిక్ పోలీసు సిబ్బందికి 200 కూలింగ్ హెల్మెట్లు, 64 ద్విచక్రవాహనాలను అందజేసి మాట్లాడారు. పోలీసుల సంక్షేమం కోసం కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి కృషి చేస్తున్నారని కొనియాడారు. కమిషనర్ బాగ్చి మాట్లాడుతూ ఎండలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసు సిబ్బంది తలకు చల్లదనాన్ని అందించేలా విశాఖ పోర్టు అథారిటీ, సౌత్ఏషియా ఎల్పీజీ సంస్థ సుమారు రూ.46 లక్షల విలువ చేసే 200 హెల్మెట్లు సమకూర్చాయన్నారు. రూ.8.2 లక్షల విలువచేసే రెండు డ్రోన్లను కూడా పోర్టు సంస్థ అందించిందన్నారు. సిబ్బంది తక్షణమే స్పందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 64 ద్విచక్రవాహనాలను కేటాయించగా, 44 ట్రాఫిక్ సిబ్బందికి, 20 శాంతిభద్రతల విభాగానికి అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో పోర్టు, ఎల్పీజీ సంస్థల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు

- దురుసుగా ప్రవర్తించిన ఏడుగురు ఉద్యోగులకు నోటీసులు: కలెక్టర్ ఆదేశం
- పీజీఆర్ఎస్‌కు 347 ఫిర్యాదులు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, జేసీ, డీఆర్వో, తదితరులు

మహారాణిపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే ప్రజల పట్ల దురుసుగా ప్రవర్తించినా, అలసత్వం వహించినా చర్యలు తప్పవని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ హెచ్చరించారు. సోమవారం కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు 347 అర్జీలు స్వీకరించారు. వినతులలో రెవెన్యూకు 136, జీవీఎంసీ 66, పోలీసు 22, ఇతర విభాగాలకు 123ఉన్నాయి. అనంతరం అధికారులతో వివిధ అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని ఆదేశించారు. క్షేత్రస్థాయికి వెళ్లి అర్జీదారులతో మాట్లాడాలని సూచించారు. పోలీసు శాఖ నిర్వహిస్తున్న ఎండార్స్‌మెంట్ విధానాన్ని మార్చాలని సూచించారు. ఆనందపురం మండలం వెల్లంకిలో సర్వే ప్రక్రియలో అధికారి నిర్లక్ష్యం వహించారని, డబ్బులు కూడా అడిగినట్లు ఫిర్యాదు అందటంతో విచారణకు ఆదేశించారు. వివిధ విభాగాలకు చెందిన ఏడుగురు ఉద్యోగులు అర్జీదారులపై దురుసుగా ప్రవర్తించినట్లు తేలిందని, వారికి నోటీసులు ఇవ్వాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డీఆర్వో భవానీశంకర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పది వేలమంది మార్గదర్శులను గుర్తించాలి

విశాఖపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పీ-4 విధానానికి అధికారులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, జిల్లాలో గుర్తించిన బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు ముందుకు వచ్చే మార్గదర్శకులను వారం రోజుల్లో గుర్తించాలని కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో అధికారులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో 50 బంగారు కుటుంబాల అవసరాలను గుర్తించాలని, జిల్లాలో ప్రతి రోజు 1,300 మందికి సంబంధించిన వివరాలపై సర్వే పూర్తిచేయాలని వివరించారు. పారిశ్రామిక, సేవా, ఇతర రంగాల్లో ఆర్థికంగా సమరత కలిగిన పదివేల మంది మార్గదర్శకులను గుర్తించాలని సూచించారు. ఒక్కో మార్గదర్శి పది కుటుంబాలను దత్తత తీసుకునేలా ప్రోత్సహించాలని, సమాజంలో 20 శాతం మంది పేదలకు అండగా నిలవాలని పేర్కొన్నారు. ఏపీఐఐసీ, పారిశ్రామిక సంస్థలు, పర్యాటక ప్రాజెక్టుల నిర్వాహకులు, వ్యాపార కంపెనీలు, అసోసియేషన్లు పీ-4లో భాగస్వామ్యులు కావాల్సి ఉందన్నారు. అధికారులు కూడా ఒక కుటుంబాన్ని దత్తత తీసుకోవాలని హితవు పలికారు. మార్గదర్శకుల ఎంపిక, ఇతర అంశాలపై నమూనా రూపొందించి అందజేయాలని సీపీవో శ్రీనివాసరావును కలెక్టర్ ఆదేశించారు.

జీవీఎంసీలో 138 వినతులు

వెంకోజీపాలెం: జీవీఎంసీ అన్ని విభాగాలకు కలిపి 138 వినతులు వచ్చాయని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. జీవీఎంసీ పాత సమావేశ మందిరంలో కమిషనర్ కేతన్ గర్గ్‌తో కలిసి వినతులు స్వీకరించారు. అర్జీలను మూడు రోజుల్లో పరిష్కరించాలని, పునరావృతం కాకుండా చూడాలన్నారు.

జగన్నాథ తిరుగు రథయాత్రకు పోటెత్తిన భక్తులు



రథయాత్రలో పాల్గొన్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ, సీఎంఆర్ సంస్థల అధినేత మావూరి వెంకటరమణ

మహారాణిపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): టౌన్ కొత్తరోడ్డులో గత నెల 27న జగన్నాథ స్వామి దేవాలయంలో ప్రారంభమైన రథయాత్ర మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. సోమవారం సాయంత్రం నిర్వహించిన తిరుగు రథయాత్రకు భక్తులు పోటెత్తారు. సాయంత్రం టర్నర్ చౌల్ట్రీ నుంచి టౌన్ కొత్తరోడ్డులోని దేవాలయం వరకు తిరుగు రథయాత్ర నిర్వహించారు. ఉదయం 9 గంటలకే బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథ స్వామి వారిని రథంపైకి తీసుకొచ్చారు. భక్తులు పెద్దసంఖ్యలో రథంపైనే ముగ్గురు మూర్తులను దర్శించుకున్నారు. స్వామికి సాయంత్రం దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేసి రథయాత్రను ప్రారంభించారు. భక్తుల గోవింద నామ స్మరణ మధ్య రథం ఆలయానికి చేరుకుంది. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ ఉప కమిషనర్ ఎన్.సుజాత, సహాయ కమిషనర్ అన్నపూర్ణ, ఈవో టి.రాజగోపాల రెడ్డి, సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, నేతలు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణపై బీఎల్‌వోలకు శిక్షణ



పద్మనాభం శిక్షణలో ఆర్డీవో సంగీత్ మాథుర్, తహసీల్దారు ఆనందరావు

విశాఖపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల నుంచి ప్రారంభం కానున్న 2026 సంక్షిప్త ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ కోసం పోలింగ్ కేంద్రం అధికారుల (బీఎల్‌వో)కు సోమవారం శిక్షణ ప్రారంభమయింది. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలో నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు పలు సూచనలిచ్చారు. భీమిలి ఈఆర్వోగా ఉన్న ఆర్డీవో సంగీత్‌మాథుర్, తూర్పు ఈఆర్వో ఉక్కుభూసేకరణ ఎస్డీసీ డీఎస్.సునీత, దక్షిణ ఈఆర్వో భూ పరిరక్షణ ఎస్డీసీ ఎ.మధుసూదనరావు, ఉత్తరలో జాతీయ రహదారుల విభాగం ఎస్డీసీ జ్ఞానవేణి, పశ్చిమలో విశాఖ ఆర్డీవో శ్రీలేఖ, గాజువాకలో వీఎంఆర్‌డీఏ ఎస్టేట్ అధికారి దయానిధి, పెందుర్తిలో కేఆర్ఆర్‌సీ ఎస్డీసీ శేషశైలజ శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఓటర్ల నమోదు, తప్పిదాలు సరిదిద్దడం, ఇంటింటికీ వెళ్లి సర్వే, మృతుల తొలగింపు, కొత్త ఓటర్ల చేరికలు, ఒక చోట నుంచి మరోచోటకు వెళ్లడం వంటి అంశాలపై వివరించారు.

జీవీఎంసీ పార్కులను కాపాడేందుకు పోరాడుతాం

- కార్పొరేటర్లు పల్లా శ్రీనివాస రావు, పీతల మూర్తియాదవ్



మాట్లాడుతున్న కూటమి కార్పొరేటర్లు

విశాఖపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీకి చెందిన ఓపెన్‌స్పేస్‌లు, పార్కులను అన్యాక్రాంతం కాకుండా కాపాడుకునేందుకు పోరాటాలకైనా వెనుకాడమని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్, టీడీపీ కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, టీడీపీ నేత గొలగాని వీరారావు అన్నారు. జీవీఎంసీలోని టీడీపీ ఫ్లోర్‌లీడర్ కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడారు. జీవీఎంసీ ఆస్తులను కొట్టేసేందుకు కూటమిలోని కొందరునేతలు ప్రయత్నిస్తున్నారని, వైసీపీ నేతలు తెరవెనుక మంత్రాంగం నడిపిస్తున్నారన్నారు. ఆరోవార్డు బటర్‌ఫ్లైపార్కులోని 489 గజాల స్థలాన్ని రహదారి లేని స్థలంతో భూమార్పిడికి ప్రభుత్వం ఆమోదించిందన్నారు. దీనిని కూటమి నేతతో మంత్రి ద్వారా వైసీపీ నేతలే నడిపించారన్నారు. 88వ వార్డు కోటనరవలో 25 ఎకరాల్లో లేఅవుట్‌వేసేందుకు కూటమి ప్రజాప్రతినిధి పథకం రచించారని, ఆభూమికి రోడ్డు లేకపోవడంతో ఈడబ్ల్యూఎస్‌లేఅవుట్‌లోని ఓపెన్‌స్పేస్‌లోని 180 గజాలను భూమార్పిడి కింద కొట్టేశారన్నారు. తాజాగా ఈస్ట్‌పాయింట్‌కాలనీలో రెండుపార్కులను కొట్టేసేందుకు జనసేనకు చెందిన ఓ ఎమ్మెల్యే ప్రయత్నాలు చేస్తున్నారని, జీవీఎంసీ అధికారులు నివేదిక సిద్ధం చేశారని ఆరోపించారు. రాజేంద్రనగర్ పార్కుని ప్రైవేటుకి కట్టబెట్టేందుకు ఇద్దరు వైసీపీ కార్పొరేటర్లు, కూటమిలోని మాజీ ఎమ్మెల్యే సఫలమయ్యారన్నారు. పార్కు స్థలాన్ని ప్రైవేటుస్థలంగా సర్వేసర్టిఫికెట్‌తో పాటు వీఎల్‌టీ వేయాలని ఒత్తిడిచేస్తున్నారన్నారు. ఐదో వార్డులో ఓపెన్‌స్పేస్‌లు కబ్జాకు గురయ్యాయని, టీడీఆర్ కొట్టేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వానికి చెడ్డపేరుతెచ్చేలా, యత్నిస్తున్న కూటమి నేతలపై చర్యలు తీసుకోవాలని సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళతామన్నారు.

క్రైం... crime news

కొత్తపాలెంలో కొట్లాట

- ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్ద ఘర్షణ
- ముగ్గురు యువకులపై కత్తితో దాడి
- పోలీసుల అదుపులో ఆరుగురు నిందితులు




తీవ్రంగా గాయపడిన రాజేశ్, కనకరాజు

గోపాలపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్ద జరిగిన స్వల్ప వివాదం కొట్లాటకు దారి తీసింది. ముగ్గురు యువకులపై ఆరుగురు కత్తితో దాడికి తెగబడడంతో వారంతా తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటన జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి..

కొత్తపాలెం ప్రధాన రహదారిలోని గౌరీ రామాలయం ఎదురుగా ఉన్న ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్ద ఆదివారం రాత్రి 10 గంటలకు కందక సూర్య, సాయి మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుంది. ఆ సమయంలో అక్కడే ఉన్న సరపాక రాజేశ్ (31) వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశాడు. ఇంతలో అక్కడకు వచ్చిన సూర్య సోదరుడు సురేంద్ర రాజేశ్‌తో వాగ్వాదానికి దిగాడు. సమీపంలో ఉన్న సూదికొండ మణికంఠ (25), లంక రమణ (25), అమరపిన్ని కనకరాజు (21) కొట్లాటను నివారించే ప్రయత్నం చేశారు. దీంతో సురేంద్ర, అతని సోదరుడు సూర్య, మిత్రులు దాడి లిఖిత్, శిలపరశెట్టి అక్షయ్, కొడగట్ల సతీశ్, రీసు నందన్ కలిసి రాజేశ్, మణికంఠ, రమణ, కనకరాజుపై దాడికి దిగారు. వీరిలో సురేంద్ర, సూర్య, లిఖిత్ తమ వద్ద ఉన్న కత్తితో రాజేశ్, రమణ, మణికంఠపై దాడి చేయడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సమీపంలో ని యువకులు గాయపడినవారిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆరా తీశారు. అప్పటికే నిందితులు పరారవడంతో ప్రత్యేక బృందాలతో గాలించి సోమవారం సాయంత్రం ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం. సీఐ ఎన్‌వీ ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎస్ఐ రామారావు ఘటనా స్థలంలో రక్త నమూనాలు, ఆధారాలు సేకరించారు. ఎస్ఐ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు

- తండ్రి మృతి, కుమారుడికి తీవ్ర గాయాలు



రమణమూర్తి (ఫైల్)

ఆనందపురం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని కారు ఢీకొనడంతో తండ్రి మృతి చెందగా, అతని కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన జాతీయ రహదారిపై వేములవలస వద్ద సోమవారం జరిగింది. సీఐ చింతా వాసునాయుడు తెలిపిన వివరాల మేరకు మన్యం జిల్లా పార్వతీపురం బొమ్మిక అగ్రహారం ప్రాంతానికి చెందిన గరకవలస రమణమూర్తి (57) ఎల్ఐసీ ఏజెంట్. కుమారుడు బేబీ సంతోష్‌తో కలిసి మద్దిలపాలెంలోని అల్లుడి ఇంటికి కారులో బయలుదేరారు. వేములవలస సమీపంలోకి వచ్చేసరికి ఆగి ఉన్న లారీని ఢీకొట్టారు. ఈ సంఘటనలో రమణమూర్తి అక్కడికక్కడే మృతి చెందగా బేబీ సంతోష్ తీవ్ర గాయాలతో బయటపడాడు. క్షతగాత్రుడిని 108 వాహనంలో తగరపువలస ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



కనకరాజు (ఫైల్ ఫొటో)

మహారాణిపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): అతిగా మద్యం సేవించి ఓ వ్యక్తి మృతి చెందాడు. కొబ్బరితోట ప్రాంతానికి చెందిన జి.కనకరాజు(41) భార్యతో విడిపోయి తల్లితో కలిసి ఉంటున్నాడు. మద్యానికి బానిసయ్యాడు. శనివారం రాత్రి డాల్ఫిన్ జంక్షన్‌లో మద్యం తాగి అదుపు తప్పి పడిపోయాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో 108 వాహనంలో కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కనకరాజును ఎవరో చంపారని కుటుంబసభ్యులు ఆరోపించడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం



దగ్ధమైన గృహోపకరణాలు

గోపాలపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఓ ఇంట్లో విద్యుత్ మీటర్ షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు వ్యాపించాయి. ఈ ఘటనలో సుమారు రూ.6 లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. గ్రేటర్ 89వ వార్డు చంద్రనగర్‌లో ప్రైవేటు ఉద్యోగి రఘు, భార్య కల్యాణి సోమవారం ఉదయం విధులకు వెళ్లారు. రఘు తల్లి రాజేశ్వరి ఇంటి వద్ద ఉండగా సాయంత్రం 4 గంటల సమయంలో విద్యుత్ మీటరు నుంచి పొగ, మంటలు వ్యాపించాయి. రాజేశ్వరి బయటకు వచ్చి సమీపంలో ఉన్నవారిని అప్రమత్తం చేసింది. స్థానికులు చేరుకునే సరికి దట్టమైన పొగ, మంటలు వ్యాపించడంతో మర్రిపాలెం అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ప్రమాదంలో గృహోపకరణాలు, విలువైన పత్రాలు దగ్ధమయ్యాయని, సుమారు రూ.6లక్షల ఆస్తినష్టం జరిగిందని బాధితులు తెలిపారు.

గంజాయి రవాణా కేసులో ఇద్దరికి జైలు

విశాఖపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేసిన ఇద్దరు ముద్దాయిలకు పదేళ్ల జైలు, రూ. 2 లక్షల చొప్పున జరిమానా విధిస్తూ ప్రధానమెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం.వెంకటరమణ సోమవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించకుంటే మరో ఆరునెలల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీవీఎస్ఎన్ ప్రసాద్ అందించిన వివరాలిలా ఉన్నాయి. మధురవాడ దుర్గానగర్‌కు చెందిన షేక్‌మస్తాన్ వలీ (26), బుట్టవారిపాలేని చెందిన గుమిలి మల్లేశ్వరరావు (25) 2016 మే 3న ఆటోలో 60 కిలోల గంజాయిని తరలిస్తూ నాతవరం పోలీస్‌స్టేషన్ పరిధి వెదురుపల్లి జంక్షన్ వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. నాతవరం ఎస్ఐ అశోక్‌కుమార్ కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశారు. దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీట్‌ను దాఖలు చేశారు. ముద్దాయిలపై నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

స్పోర్ట్స్ ఎరీనాను స్వాధీనం చేసుకోండి

- జీవీఎంసీ కమిషనర్‌కు సీపీఎం కార్పొరేటర్ గంగారావు ఫిర్యాదు

విశాఖపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా రూ.25 కోట్లతో నిర్మించి ప్రైవేటు నిర్వహణకు అప్పగించిన స్పోర్ట్స్ ఎరీనాకు రూ.2 కోట్లు అద్దె బకాయి ఉన్నందున తక్షణం స్వాధీనం చేసుకోవాలని సీపీఎం కార్పొరేటర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌కు ఫిర్యాదుచేశారు. ఎంవీపీలోని సుమారు 1.4 ఎకరాల్లో స్పోర్ట్స్ ఎరీనా నిర్మించారని, ఏడాదికి రూ.1.02కోట్లు అద్దె చెల్లించేలా ప్రైవేటుకు 2023లో ఐదేళ్లపాటు లీజుకి ఇచ్చేశారన్నారు. లీజు సక్రమంగా చెల్లించకపోవడంతో రూ.2 కోట్లు బకాయి ఉందని, అయినా లీజుదారుడిపై చర్యలు తీసుకోవడంలేదన్నారు. పైగా జవీఎంసీ స్కూళ్లలో చదివేవారికి ఉచిత ప్రవేశం, ఉద్యోగులకు 50శాతం రాయితీ, నీటి చార్జీలు చెల్లించడం లేదన్నారు. స్టేడియం ఆదాయవ్యయాలను ఎప్పటికప్పుడు జీవీఎంసీకి అందజేయడం లేదని, ఎస్క్రూ అకౌంట్‌ను నిర్వహించడం లేదన్నారు. రెండునెలల్లో బకాయి చెల్లించకపోతే స్టేడియంను స్వాధీనం చేసుకోవాలన్నారు.

పలు రైళ్లు రీ షెడ్యూల్

విశాఖపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక కారణాలతో పలు రైళ్లను రీ షెడ్యూల్ చేశారు. సోమవారం ఉదయం 10.35 గంటలకు బెంగళూరులో బయలుదేరాల్సిన బెంగళూరు-హౌరా మధ్యాహ్నం 2 గంటలకు, మధ్యాహ్నం 2.50 గంటలకు విశాఖ లో బయలుదేరాల్సిన విశాఖ-దుర్గ్ వందేభారత్ సాయంత్రం 4.40, రాత్రి 7 గంటలకు చెన్నైలో బయలుదేరాల్సిన చెన్నై-హౌరా మెయిల్ 8 గంటలకు బయలుదేరాయి.